

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు

వార్త

## నేడు నెల్లూరుకు రాష్ట్ర గవర్నర్ రాక

- కట్టుదిట్టమైన భద్రతతో సిద్ధమైన జిల్లా పోలీస్ యంత్రాంగం



**నెల్లూరు-క్రైం, జూన్ 8, ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ మంగళవారం జిల్లాలో పర్యటించనున్నారు. విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం కార్యక్రమంలో పాల్గొననున్న నేపథ్యంలో, జిల్లా పోలీసు యంత్రాంగం పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. జిల్లా ఇంచార్జ్ ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆధ్వర్యంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) సి.హెచ్. సౌజన్య పర్యవేక్షణలో ఈ భద్రతా ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. కార్యక్రమ వేదికైన విపిఆర్‌కన్వెన్షన్ సెంటర్, హెలిప్యాడ్, గవర్నర్ ప్రయాణ మార్గాల్లో బహుళస్థాయి భద్రతా వలయాన్ని ఏర్పాటు చేశారు. నిర్వహించిన బ్రీఫింగ్‌లో అడిషనల్ ఎస్పీ సౌజన్య, టౌన్ ఎఎస్‌పి దీక్ష, రూరల్ డిఎస్పీ ఘట్టమనేని శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు. కాన్వాయ్ ట్రయల్ రన్‌తో పాటు క్విక్ రియాక్షన్ టీమ్స్, బిడి టీమ్స్, డాగ్ స్క్వాడ్లను మోహరించినట్లు అధికారులు తెలిపారు. భద్రతా పరమైన ఆంక్షలకు ప్రజలు, వాహనదారులు సహకరించాలని స్థానిక సీఐలు కళ్యాణ్ రాజు, వేణు, వెంకట రెడ్డిలు కోరారు.

## కండలేరులో 37.1 టీయంసీల నీటిమట్టం



**రాపూరు, జూన్ 8, ప్రభాతవార్త** మండలంలోని కండలేరు జలాశయంలో సోమవారం ఉదయానికి 37.1 టీయంసీల నీటిమట్టం నమోదు అయినట్లు కండలేరు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. జలాశయం నుండి లో లెవల్ స్లూయిస్ ద్వారా 50 క్యూసెక్కులు, హై లెవల్ కెనాల్ ద్వారా 50 క్యూసెక్కులు,కండలేరు హెడ్ రెగ్యులేటం ద్వారా 1280 క్యూసెక్కులు,హెడ్ రెగ్యులేటర్ పవర్ హౌస్ ద్వారా 715 క్యూసెక్కుల చొప్పున మొత్తం 2095 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లోగా వెలుతున్నట్లు ఆయన తెలిపారు.

## బీహార్ రోడ్డు ప్రమాదంలో ముగ్గురు నెల్లూరు జిల్లా వాసులు మృతి

### తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి

**నెల్లూరు, జూన్ 8, ప్రభాతవార్త - వైద్యం** బీహార్‌లో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని ఆత్మకూరు, సంగం, చుట్టు పక్క ప్రాంతల నుంచి 43 మంది యాత్రికులతో గయ, వారణాసి పుణ్యక్షేత్రాల దర్శనానికి బయలుదేరిన ప్రైవేటు బస్సు, బీహార్ రాష్ట్రంలోని గయ నుంచి వారణాసి వెళ్లే మార్గం మధ్యలో ఆదివారం రాత్రి ప్రమాదానికి గురైంది. క్షేమంగా తిరిగి వస్తారనుకున్న యాత్రికులలో ముగ్గురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరమని ఎంపీ పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో సంగం కేంద్రానికి చెందిన, ప్రస్తుతం నెల్లూరులో నివాసముంటున్న పసుపులేటి వెంకటేశ్వర్లు, సంగంలో చిరు వ్యాపారిగా పనిచేసే చౌడం హజరత్తయ్యతో పాటు, ఆత్మకూరు వీవర్స్ కాలనీకి చెందిన సోమ పెంచల ప్రసాద్ భార్య పద్మావతి మృతి చెందడంపై ఎంపీ తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ ప్రమాదంలో మరో 15 మంది గాయపడటం బాధాకరమన్నారు. ఘటన జరిగిన వెంటనే నెల్లూరు ఎంపీ కార్యాలయం అప్రమత్తమైందని, ఢిల్లీలోని తన కార్యాలయ సిబ్బంది ద్వారా బీహార్ రాష్ట్రంలోని ఔరంగాబాద్ జిల్లా అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు ఎంపీ వెల్లడించారు. ప్రమాదంలో గాయపడిన 15 మందికి అక్కడ తక్షణమే మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. బాధిత కుటుంబాలకు అన్ని రకాలుగా పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తెలిపారు.

## పుణ్యక్షేత్రాల యాత్రలో విషాదం

- ప్రమాద వార్తపై తక్షణమే స్పందించిన మంత్రి నారాయణ

**నెల్లూరు, జూన్ 8, ప్రభాతవార్త - వైద్యం** నెల్లూరు జిల్లాకు చెందిన యాత్రికులు బీహార్‌లో ఘోర రోడ్డు ప్రమాదానికి గురై ముగ్గురు మృతి చెందిన ఘటనపై రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తీవ్ర దిగ్భ్రాంతిని, ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. పుణ్యక్షేత్రాల దర్శనానికి వెళ్లి ఇలా ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని, మృతుల కుటుంబాలకు ఆయన తన సానుభూతిని తెలియజేశారు. ప్రమాద వార్త అందిన వెంటనే తీవ్రంగా స్పందించిన మంత్రి నారాయణ, బీహార్, రాష్ట్ర ఉన్నతాధికారులతో పాటు స్థానిక జిల్లా యంత్రాంగంతో అత్యవసరంగా మాట్లాడారు. నెల్లూరు జిల్లాకు చెందిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని మంత్రి నారాయణ ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.

## బీహార్ రోడ్డు ప్రమాద బాధితులకు యుద్ధ ప్రాతిపదికన సహాయ చర్యలు

- మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి
- సీఎంవో కార్యాలయం, ఢిల్లీ ఆంధ్ర భవన్, బీహార్ అధికారుల సమన్వయంతో బాధితులకు సహాయ సహకారాలు అందిస్తున్నాం
- ముఖ్యమంత్రి ఆదేశాలతో మృతదేహాల తరలింపునకు ప్రత్యేక విమానం
- క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు
- బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది

**నెల్లూరు, జూన్ 8, ప్రభాతవార్త - వైద్యం** బీహార్ రాష్ట్రంలోని ఔరంగాబాద్ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నెల్లూరు జిల్లా యాత్రికులు మృతి చెందడం తీవ్ర విషాదకరమని, బాధితులకు సత్వర సహాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టిందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. నెల్లూరు సంతపేటలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ గయా నుంచి వారణాసికి వెళ్తున్న యాత్రికుల బస్సు ఔరంగాబాద్ సమీపంలో లారీ ఢీకొనడంతో ప్రమాదం జరిగిందన్నారు. ఈ ప్రమాదంలో సంగం, ఆత్మకూరు, దుత్తలూరు ప్రాంతాలకు చెందిన యాత్రికులు ప్రయాణిస్తున్నారని, ఉదయం 5 గంటల సమయంలో సమాచారం అందిందని చెప్పారు. బస్సులో మొత్తం 45 మంది ప్రయాణిస్తున్నారని, వారిలో ఇద్దరు డ్రైవర్లు, ఒక వంటమనిషి, 42 మంది యాత్రికులు ఉన్నట్లు తెలిపారు. ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, 15 మంది గాయపడ్డారని వెల్లడించారు. మృతి చెందిన వారిలో టూర్ అటెండెంట్, వంటమనిషి, ఒక మహిళా యాత్రికురాలు ఉన్నారని చెప్పారు. సమాచారం అందిన వెంటనే జిల్లా కలెక్టర్, ముఖ్యమంత్రి కార్యాలయం, ఢిల్లీలోని ఆంధ్రభవన్ కమిషనర్‌కు సమాచారం ఇచ్చి సహాయక చర్యలు ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఘటనపై వెంటనే స్పందించి బాధితులకు అత్యవసర సహాయ సహకారాలు అందించాలని అధికారులను ఆదేశించారని వెల్లడించారు.

**ప్రత్యేక విమానంలో మృతదేహాల తరలింపు** గయా నుంచి నెల్లూరు జిల్లాకు రోడ్డు మార్గంలో రావడానికి 38 గంటలకు పైగా సమయం పడుతుందని, ఈ నేపథ్యంలో మృతి చెందిన ముగ్గురు యాత్రికుల మృతదేహాలను సోమవారం ఉదయం ప్రత్యేక విమానంలో గయా నుంచి రేణిగుంట విమానాశ్రయానికి తీసుకువస్తామని మంత్రి తెలిపారు. అక్కడి నుంచి జిల్లా అధికారుల పర్యవేక్షణలో ప్రత్యేక వాహనాల ద్వారా వారి స్వగ్రామాలకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

**క్షతగాత్రులకు వైద్య సేవలు** ప్రమాదంలో గాయపడిన 15 మంది యాత్రికులకు గయాలోని మెడికల్ కాలేజీలో వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. క్షతగాత్రులను కూడా ప్రత్యేక విమానంలో చెన్నైకి తీసుకువచ్చి, అక్కడి నుంచి ప్రత్యేక బస్సుల ద్వారా అధికారుల సహకారంతో నెల్లూరు జిల్లాకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.

**కంట్రోల్ రూమ్ ఏర్పాటు - నిరంతర పర్యవేక్షణ** ముఖ్యమంత్రి కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి బీహార్ అధికారులతో సమన్వయం కొనసాగిస్తున్నామని మంత్రి తెలిపారు. ఢిల్లీలోని ఆంధ్రభవన్ కమిషనర్ ఆధ్యా శ్రీకాంత్ బీహార్ ప్రభుత్వ అధికారులతో, సీఎంవో అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ పరిస్థితిని సమీక్షిస్తున్నారని చెప్పారు.

**తెలుగు అధికారుల సహకారంతో ఘటనా స్థలంలో సహాయక చర్యలు** బీహార్‌లో పనిచేస్తున్న సీనియర్ తెలుగు ఐఏఎస్ అధికారి డా. రాజేందర్ కుమార్, ఐపీఎస్ అధికారి వివేక్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు ప్రమాద స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారని మంత్రి వెల్లడించారు.



**మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి** ఈ ప్రమాదంలో మొత్తం ముగ్గురు భక్తులు మృతి చెందడం అత్యంత బాధాకరమని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని సంగం, ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గంలోని దుత్తలూరు నుంచి ఈనెల 1న ప్రైవేట్ బస్సు లో గయా, వారణాసి యాత్రకు వెళ్లిన భక్తులు ప్రమాదానికి గురికావడం తీవ్ర విచారం కలిగించిందన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన మంత్రి, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వారికి అవసరమైన వైద్య సహాయం అందేలా అధికారులు నిరంతరం చర్యలు చేపడుతున్నారని తెలిపారు.

**ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుంది** ఈ క్లిష్ట సమయంలో బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని మంత్రి భరోసా ఇచ్చారు. బాధితులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి పశ్చిమ గోదావరి జిల్లా పర్యటన ముగిసిన అనంతరం పరిహారం అంశంపై నిర్ణయం ప్రకటించే అవకాశం ఉందన్నారు. దూర ప్రాంతంలో జరిగిన ఈ విషాద ఘటనతో కుటుంబ సభ్యులు తీవ్ర వేదనలో ఉన్నారని, వారికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యం పొందాలని ఆకాంక్షించారు.

## సత్వరమే భూ సమస్యలు పరిష్కరించేలా చర్యలు

- జాయింట్ కలెక్టర్ ఎం. వెంకటేశ్వర్లు
- పరిష్కార వేదికకు 388 అర్జీలు



**నెల్లూరు-కలెక్టరేట్ , జూన్ 8, ప్రభాతవార్త** ఎప్పటి నుంచో పెండింగ్లో ఉన్న భూ సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు సంబంధిత మండల అధికారులు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా అధికారులు ఈపిటిఎఫ్ డాక్యుమెంట్లు అప్లోడ్, పిజిఆర్ఎస్ అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సోమవారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ప్రజల నుండి అర్జీలను జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా రెవెన్యూ అధికారి విజయ్ కుమార్, తెలుగు గంగ ప్రత్యేక అధికారి మహేశ్వర రెడ్డి, మెప్మా పి.డి.కిరణ్ కుమార్, ఐటిడిఏ పిఓ శ్రీనివాసరావు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ డిప్యూటీ డైరెక్టర్ నాగ శేఖర్ తదితరులు అర్జీ దారుల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రేపు జిల్లాలో పర్యటించిన రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పర్యటనను సంబంధిత అధికారులు విజయవంతం అయ్యేలా తమకు కేటాయించిన విధులను జాగరుకతతో నిర్వహించి గవర్నర్ పర్యటన విజయవంతం చేయాలని సూచించారు. జిల్లా అధికారులు ఆయా శాఖలకు సంబంధించి పిజిఆర్ ఎస్ ద్వారా వచ్చిన అర్జీలను పరిష్కారం అయ్యేలా చూడాలని సదరు విషయాలను సంబంధిత అర్జీదారులకు తెలియజేయాలని ఆయన సూచించారు. అధికారులు ఈపిటిఎస్, పిజిఆర్ఎస్ లో అర్జీలను త్వరితగతిన పరిష్కరింప చేయాలన్నారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులకు అవసరమైన మౌలిక వసతులతో పాటు ప్రత్యేక క్యూ లైన్‌ను ఏర్పాటు చేయడంతో పాటు చలువ పందిళ్లను ఏర్పాటు చేయడం జరిగింది. అలాగే ఉచిత భోజన సదుపాయాన్ని అందించారు. రెవిన్యూ సంబంధిత విషయాలను పరిష్కరించే విధంగా ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయడంతో పాటు ప్రాథమిక వైద్యం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**పరిష్కార వేదికకు 388 అర్జీలు..** సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగే పరిష్కార వేదికకు మొత్తం 388 అర్జీలు రాగా దాంట్లో అధిక సంఖ్యలో రెవిన్యూ శాఖ 168, పోలీస్ శాఖ 42, మునిసిపల్ శశాఖ 24 కొన్ని మరిన్ని శాఖలు ఉన్నాయి.

## ఆంధ్రటూరిస్టు బస్సుకు భీహార్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- సంగం వాసులు ఇద్దరు మృతి, పలువురుకి గాయాలు





**సంగం జూన్ 8 ప్రభాతవార్త** ఆంధ్ర టూరిస్టు బస్సుకు బీహార్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది.ఈ సంఘటనలో ఇద్దరు సంఘం వాసులు మృతి చెందారు. జూన్ 1 వ తేది సంగం ప్రాంతం నుండి 45 మందితో ఈ బస్సు కాశీకి బయలు దేరింది.ఈ బస్సులో మొత్తం సంగంకి చెందిన వారు 15 మంది ఉన్నారు. సంగం,దుత్తలూరు,ఆత్మకూరుకు చెందిన యాత్రికులతో బస్సు ఈనెల 1 వ తేది కాశీయాత్రకు బయలుదేరింది. గయా,వారణాసి పుణ్యక్షేత్రాల దర్శనానికి బయలుదేరిన ఈ యాత్ర బస్సు బీహార్ రాష్ట్రం గయావద్ద ఘోర రోడ్డు ప్రమాదానికి గురైంది. ఎదురుగా వస్తున్న లారీ అతి వేగంతో బచ్చి బస్సును ఢీకొనగా సంగంకి చెందిన ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతిచెందారు. చౌడం హజరత్తయ్య (60) వంట మాష్టర్, పుసులేని వెంకటేశ్వర్లు (63) రిటైడ్ ఆర్టీసి కండక్టర్ ఈసంఘటనతో సంగంలో కుటుంబసభ్యుల ఆర్తనాదాలు మిన్నంటాయి. విషయం తెలిసిన వెంటనే దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మంత్రి ఆనం ఎప్పటికప్పుడు సమీక్షిస్తు క్షతగాత్రలకు మెరుగైన వైద్యం అందించేందుకు తగు చర్యలు తీసుకున్నారు.

**ప్రత్యేక విమానంలో మృతదేహాలు :** గయా నుండి నెల్లూరు జిల్లా మృతదేహాలను రోడ్డు మార్గన తీసుకొని రావాలంటే 38 గంటలు పైగా సమయం పడుతుందని మృతి చెందిన ముగ్గురు యాత్రికుల మృతదేహాలను సోమవారం ఉదయం ప్రత్యేక విమానంలో గయా నుండి రేణుగుంట విమానాశ్రయానికి తీసుకొని వస్తున్నట్లు మంత్రి ఆనం వెల్లడించారు. జిల్లా అధికారుల పర్యవేక్షణలో ప్రత్యేక వాహనాల ద్వారా వారి స్వగ్రామాలకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రమాదంలో గాయపడిన 15 మంది యాత్రికులకు గయాలోని మెడికల్ కాలేజిలో వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. క్షతగాత్రులను కూడా ప్రత్యేక విమానంలో చెన్నైకి తీసుకొని వచ్చి అక్కడి నుండి ప్రత్యేక బస్సుల ద్వారా అధికారు సహకారంతో నెల్లూరు జిల్లాకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

**ముఖ్యమంత్రి చంద్రబాబు విచారం :** భీహారలో ఔరంగాబాద్ సమీపంలో నెల్లూరు జిల్లాకు చెందిన కాశీయాత్ర టూరిస్టు బస్సు ప్రమాదానికి గురైన సంఘటపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సిఎం చంద్రబాబునాయుడు సానుభూతిని తెలిపారు. యాత్రికులను త్వరితగతిన స్వస్థలాలకు చేర్చేందుకు భీహార్ ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నారు. అలాగే కేంద్ర విమానయానశాఖమంత్రి రామ్మోహన్‌నాయుడు కూడా స్పందించి క్షతగాత్రులను స్వస్థలాలకు చేర్చేందుకు విమానయాన సంస్థను ఉపయోగించుకోవాలిన సూచించారు. ఈ సంఘటన నెల్లూరు జిల్లాను కుదిపివేసింది.

## బీహార్ రోడ్ ప్రమాద మృతుల బాధిత కుటుంబాలకు నష్టపరిహారం ప్రకటించిన ముఖ్యమంత్రి

మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

**నెల్లూరు, జూన్ 8, ప్రభాతవార్త - వైద్యం** మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షలు, తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులకు 2 లక్షలు, పాక్షికంగా గాయపడిన వారికి లక్ష చొప్పున ఆర్థిక సహాయం మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నెల్లూరు, జూన్ 8 : బీహార్ రాష్ట్రంలోని ఔరంగాబాద్ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నెల్లూరు జిల్లా వాసుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నష్టపరిహారం ప్రకటించినట్లు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు.ఈ ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందజేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. అలాగే తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులకు రూ.2 లక్షల చొప్పున, పాక్షికంగా గాయపడిన వారికి రూ.1 లక్ష చొప్పున నష్టపరిహారం అందజేయనున్నట్లు తెలిపారు. నష్టపరిహారం ప్రకటించి బాధితులకు అండగా నిలిచిన ముఖ్యమంత్రి కి ఈ సందర్భంగా మంత్రి ఆనం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ప్రమాద బాధితుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలు అందించి అండగా నిలుస్తుందని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి బాధితులకు భరోసా కల్పించారు.బాధిత కుటుంబాలకు అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందించేందుకు ప్రభుత్వం నిరంతరం చర్యలు చేపడుతోందని ఆయన పేర్కొన్నారు.

## యోగాతో ఆరోగ్యం.. ప్రకృతి ఒడిలో ప్రశాంతత

- రామతీర్థం బీచ్లో సామూహిక యోగాకు విశేష స్పందన
- పాల్గొన్న జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు





**విడవలూరు, జూన్ 8, ప్రభాతవార్త :** యోగా ద్వారా శారీరక దారుఢ్యం, మానసిక ప్రశాంతత, ఏకాగ్రతతో పాటు సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న 'యోగాంధ్ర2026 కార్యక్రమంలో భాగంగా రామతీర్థం సాగరతీరంలో ఆదివారం నిర్వహించిన సామూహిక యోగా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సముద్ర అలల సవ్వడులు, స్వచ్ఛమైన గాలి, ప్రకృతి సోయగాల నడుమ సాగిన యోగా కార్యక్రమం ఆకట్టుకుంది. జాయింట్ కలెక్టర్తో పాటు వివిధ శాఖల అధికారులు, యోగా గురువులు, సాధకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని యోగాసనాలు నిర్వహించారు.

**మొగిలి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ** ఆధునిక జీవనశైలితో పెరుగుతున్న అనారోగ్య సమస్యలను అధిగమించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. శరీరం, మనస్సు, ఆత్మ మధ్య సమతుల్యతను పెంపొందించే గొప్ప సాధనమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ నిత్యజీవితంలో యోగాను భాగం చేసుకోవాలని సూచించారు. యోగా గురువులు డా. స్వప్న, జయంతి, యోషిత వివిధ యోగాసనాల ప్రాముఖ్యతను వివరించి సాధన చేయించారు. యోగా వల్ల శారీరక సామర్థం పెరగడంతో పాటు మానసిక ఒత్తిడి తగ్గి జీవన నాణ్యత మెరుగుపడుతుందని తెలిపారు.

❖ ప్రకృతి ఒడిలో నిర్వహించిన ఈ కార్యక్రమం పాల్గొన్న వారిలో నూతన ఉత్సాహాన్ని నింపింది. జిల్లావ్యాప్తంగా యోగాంధ్ర2026 కార్యక్రమాలు కొనసాగుతున్నాయని, జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవం వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి యోగా పట్ల ప్రజల్లో మరింత చైతన్యం కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు.

❖ ఈ కార్యక్రమంలో ఐటిడిఏ పీఓ శ్రీనివాసరావు, ఆయుష్ నోడల్ అధికారి డాక్టర్ శ్రీనివాసరాజు, జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎస్.కె. హజర్ అలీ, డీఎంహెచ్వో డాక్టర్ సుజాత, ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్, మత్స్యశాఖ అధికారి చాన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేషన్ పిజిఆర్ఎస్‌లో 38 అర్జీలు

**నెల్లూరు కార్పొరేషన్, జూన్ 8 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్ దేవరకొండ సుజాత అశోక్ పాల్గొని అర్జీదారుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో మేయర్ మాట్లాడుతూ ప్రజల నుంచి అందుకొన్న పిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటికి సంబందించిన విభాగాల అధికారుల ద్వారా శాశ్వత పరిష్కారం అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో విభాగాల వారీగా టిడ్కో హౌసింగ్ 8, టౌన్‌ప్లానింగ్ 12, రెవెన్యూ 5, ఇంజనీరింగ్ 5, ఆప్కాస్ 4, అకౌంట్ సెక్షన్ 1, పబ్లిక్‌హెల్త్ 2, హెచ్‌సెక్షన్ 1, మొత్తం 38 వినతులను స్వీకరించారు.

ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ డిప్యూటి కమిషనర్ చెన్నడు, ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ రహంతుజానీ, ఈఈలు శేషగిరిరావు, అనీల్‌కుమార్, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ దినేష్, ఉద్యానశాఖ అధికారి నరసింహారావు, అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల అభివృద్ధి

- జెడ్పీ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ

**నెల్లూరు-కలెక్టరేట్ , జూన్ 8, ప్రభాతవార్త** ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని, తాగునీరు, పారిశుద్ధం, రహదారులు, విద్య, ఆరోగ్యం, వ్యవసాయం మహిళా సాధికారత, యువజన అభివృద్ధి తదితరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ అధికారులకు సూచించారు. జిల్లా స్థాయి పంచాయతీ డెవలప్మెంట్ ప్లాన్ (జీపీడీపీ) పై సోమవారం జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సంబంధిత శాఖల జిల్లా స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, పంచాయతీ డెవలప్మెంట్ అధికారులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్న ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి చైర్ పర్సన్ మాట్లాడుతూ జీపీడీపీ ద్వారా జిల్లాలోని ప్రతి పంచాయతీ సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలన్నారు. పరిశుభ్రమైన గ్రామాలు, సురక్షితమైన తాగునీరు, మెరుగైన విద్యా సదుపాయాలు, రైతులకు మద్దతు, మహి ళలు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రధాన లక్ష్యాలు కావాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను, విడుదల చేస్తున్న నిధులను సద్వినియోగం చేసుకోవాలన్న ఆమె గ్రామ పంచాయతీ డెవలప్మెంట్ ప్లాన్ ముఖ్య ఉద్దేశం కూడా ఇదేనన్నారు. అభివృద్ధి అనేది కేవలం ప్రభుత్వ కార్యక్రమం కాదన్న ఆమె ప్రజల భాగస్వామ్యంతో సాధ్యం అయ్యే ఉద్యమమన్నారు. గ్రామసభల్లో ప్రతి పౌరుడు పాల్గొనేలా, తమ గ్రామ అవసరాలు తెలియజేసేలా కార్యక్రమం రూపొందించాలన్న ఆనం అరుణమ్మ ప్రజల సూచనలతో రూపొందిన ప్రణాళికలే గ్రామాలకు శాశ్వత అభివృద్ధి చెందిస్తాయన్నారు. కాగా ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో శ్రీధర్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి వసుమతి, గూడూరు డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసర్ వాణి, ఎన్ఆర్‌డిఐ కోఆర్డినేటర్ ప్రసాద్, అన్ని మండలాల ఎంపీడీవోలు డిప్యూటీ ఎంపీడీవోలు, పంచాయతీ డెవలప్మెంట్ అధికారులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



# ఆత్మహత్య చేసుకున్న హుసేన్‌కి న్యాయం జరగాలి



**మనుబోలు జూన్ 8 ప్రభాతవార్త** ఆత్మహత్య చేసుకున్న విఆర్ఓ మహమ్మద్ హేసేన్‌కు న్యాయం చేయాలని రాష్ట్ర కమిటి పిలుపు మేరకు మనుబోలు రెవిన్యూ కార్యాలయం వద్ద విఆర్ఓలు నిరసన తెలిపారు. ఈసందర్భంగా విఆర్ఓ సంఘం నాయకులు నాగేంద్ర కుమార్ మాట్లాడుతు విఆర్ఓలను అధికారులు మానవతా దృకృథంతో ఆలోచించకుండా పనిచేయాలని వేదిస్తున్నారన్నారు. అనవసరమైన టార్గెట్ ఇస్తు వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశిస్తు మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారన్నారని అన్నారు. దీనివల్ల వీఆర్ఓ హుసేన్ ప్రాణాలు కోల్పోయాడాన్నారు. ఒకకుటుంబంలో యజమాని చనిపోతే ఆకుటుంబ ఎలా వేతన పడుతుందో అందరికి తెలుసు అన్నారు. ఇది తెలిసి కూడా అధికారులు ఇలా వేదించడం సరికాదన్నారు. మహమ్మద్ హుసేన్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు తాము పోరాటం చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో విఆర్ఓ సంఘం నాయకులు నాగార్జునరెడ్డి,గుణశేఖర్, రాకేష్,శ్రీనివాసులు, తదితరులున్నారు.

# భూ సమస్యలు లేని మండలంగా తీర్చిదిద్దుతా..



**నెల్లూరు, జూన్ 8, ప్రభాతవార్త – అగ్రికల్చర్** నెల్లూరు రూరల్ మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్లో ముఖ్యంగా రెవిన్యూ సమస్యల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యత నిచ్చి పరిష్కారం చేస్తానని శనివారం నూతనంగా బాధ్యతలు చేపట్టిన రూరల్ తాసిల్దార్ వి.సుధీర్ తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో ప్రజల విజ్ఞప్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన వార్త ప్రతినిధితో మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా వివిధ సమస్యల గురించి ప్రజల అందిస్తున్న వినతుల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. మండలంలో రీసర్వే దాదాపు పూర్తయిందని, ఆమంచర్ల మిగిలి ఉన్న నేపథ్యంలో అది కూడా విజయవంతంగా పూర్తి చేస్తామని వివరించారు. వన్ మంత్ వన్ విలేజ్ ఫోర్ విజిట్స్ కార్యక్రమాన్ని నిరంతరాయంగా కొనసాగిస్తూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడం జరుగుతుందన్నారు. ప్రజలకు, విద్యార్థులకు అవసరమైన వివిధ సర్టిఫికెట్ల జారిని సత్వరమే పరిష్కరిస్తూ, పారదర్శక పాలన అందించడం జరుగుతుందన్నారు. తమ కార్యాలయాన్ని ప్రక్షాళన చేస్తూ అవినీతికి తావులేని పాలన అందించడం జరుగుతుందని తెలిపారు. తన పరిధిలో లేని సమస్యలు తమ దృష్టికి వస్తే పై స్థాయి అధికారులకు తెలియజేసి పరిష్కారానికి కృషి చేస్తానని వెల్లడించారు.

# ఆటపాటలతో కూడిన విద్యపై దృష్టి పెట్టాలి



**కోవూరు, జూన్8 ప్రభాతవార్త** ప్రాథమిక స్థాయిలో చిన్నారులకు విద్యను పూర్తిస్థాయిలో బలోపేతం చేసేందుకే ప్రభుత్వం ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ రమేష్ కుమార్ అన్నారు. కోవూరులోని జేబీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న కోవూరు నియోజకవర్గ స్థాయి ఫౌండేషన్ లిటరసీ , న్యూమరసీ శిక్షణా తరగతులను సోమవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక దశలోనే విద్యార్థుల్లో ఉన్నఅభ్యసనా సామర్థ్యాలను పూర్తిస్థాయిలో వెలికి తీసేందుకు ఈ శిక్షణాతరగతులు ఉపయో గపడతాయని, దీనిని ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో ఆకలింపు చేసుకోవాలన్నారు. ప్రాథమిక దశలో ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తే అది వారి మేదస్సుకు బలంగా నాటుకుంటుందన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాలలో అమలు చేసేలా ప్రతి ఉపాధ్యాయుడు దృష్టి పెట్టాలన్నారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి -2 చెంచులక్ష్మమ్మ ఉపాధ్యాయులకు పలు అభ్యసనా సామర్థ్యాలపై అవగాహన కల్పించారు. డీఆర్‌పీలు వేణుగోపాల్, శ్రీనివాసులు, వాసుబాబు, కేఆర్‌పీ మానస, తదితరులు ఉన్నారు.

# వైభవంగా పల్లకి సేవ





**కోవూరు, జూన్8 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కామాక్షి సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో సోమవారం ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనాథం సుబ్బరామయ్య ఆధ్వర్యంలో అభిషేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పల్లకి సేవను శివభక్త బృందం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శివ భక్త బృందం సభ్యులు నాగరాజు, మోహన్, జనార్ధన్, సుకుమార్, శ్రీనివాసులు, పెద్ద సంఖ్యలో భక్తులు ఉన్నారు.

# ఆలయ భూములకు వేలలపాటలు నిర్వహించలేదు



**కోవూరు, జూన్8 ప్రభాతవార్త** కోవూరు మండలం పాటూరు గ్రామ పంచాయతీలో కడప జిల్లాలో ఉన్న చంద్రమౌళీశ్వర స్వామి, పుష్పగిరి మఠంకు చెందిన ఆలయ భూములు సర్వే నెంబర్ 159/2 490లో ఉన్నాయని, గత మూడు సంవత్సరాల క్రితం దేవాదాయ శాఖ వేలంపాట నిర్వహించి వెంటనే రద్దు చేశారని, దీనికి తిరిగి వేలంపాట నిర్వహించాలని ఆ గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యులు ప్రసాద్ సోమవారం తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా పాట నిర్వహించకుండా వేరే వ్యక్తులు దానిని స్వాధీనం చేసుకుని వ్యవసాయం చేస్తున్నారని, దీనిని పరిశీలించి న్యాయం చేయాలని ఈ సందర్భంగా ఫిర్యాదులో పేర్కొన్నారు.

# వేడుకగా గంగపెట్టి-గంగాస్నానం



**సంగం జూన్ 8 ప్రభాతవార్త** మండలకేంద్రమైన సంగంలో జరుగుతున్న శ్రీశ్రీశ్రీ పాలేటి గంగమ్మ తల్లి దేవస్దానంలో జరుగుతున్న జాతర మహోత్సవంలో సోమవారంగంగపెట్టె,గంగ స్నానం అత్యంత భక్తి శ్రద్దలనడుమ నిర్వహించరు.అమ్మవారికి ప్రత్యేక పూజలు అలంకారం చేశారు. మధ్యహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయింత్రం 4 గంటలకు పొంగళ్ళు కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి 7 గంటలకు అమ్మవారి గ్రామోత్సవం కన్నుల పండుగగా జరిగింది. ఈకార్యక్రమం లో ప్రజలు పెద్దఎత్తున పాల్గోని అమ్మవారిని దర్శించుకొని పరవశించారు.

# రెవిన్యూ పనిభార తగ్గించాలి



సీతారామపురం జూన్ 8 ప్రభాతవార్త రెవిన్యూ అధికారులపై పెరుగుతున్న పనిభారం తగ్గించాలని కోరుతు సీతారామపురం తహసిల్దారు కార్యాలయం ఆవరణంలో రెవిన్యూ సిబ్బంది ఆందోళన నిర్వహించారు. విధులకు సంబందం లేని అదనపు బాధ్యతలు అప్పగించడం పట్ల తీవ్ర ఒత్తిడికి గురౌతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.ఖాళీగా ఉన్న పోస్టులను భర్తి చేసి సిబ్బంది కొరతను నివారించాలని ప్రభుత్వాన్ని కోరారు.తమ సమస్యలను పరిష్కరించి పని పరిస్థితులను మెరుగు పరచాలని డిమాండ్ చేస్తు తహసిల్దారు షేక్ ఫజిహాకు వినతి పత్రాన్ని అందించారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని రెవిన్యూ సిబ్బంది ప్రభుత్వాన్ని కోరారు.ఈకార్యక్రమంలో విఆర్ఒలు మనోహర్, తిరుపతయ్య,ఖాజామొహుదీన్,వంశీ బాలు, తదితరులు పాల్గోన్నారు.

# ఆయుష్ ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం



కావలి, జూన్ 8 ప్రభాతవార్త :ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజావిజ్ఞపుల కార్యక్రమం జరిగే పలు ప్రభుత్వ కార్యాలయాల్లో ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరాలను నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు మేరకు సోమ వారం కావలి, చిన్న కాక, సిద్దన కొండూరు ఆయుర్వేద వైద్యశాలల ఆధ్వర్యంలో కావలి ఆర్డీఓ కార్యాలయం వద్ద సోమవారం ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరాన్ని నిర్వహించడం జరిగింది. ఈ శిబిరంలో ఆయుర్వేద వైద్యులు డాక్టర్ హాలీమౌలాలి, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ రోహిణిలు పాల్గొని ఎండలు తవ్రంగా ఉన్నందున పాటించాల్సిన జాగ్రత్తలపై ఎండల బారినుంచి ఏ విధంగా కాపాడుకోవాలి సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించి తగిన సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగింది. సిబ్బంది ఎం.క్రిష్ణకుమార్, దీప్తి, యోగ ఇన్స్‌పెక్టర్ శ్రీకాంత్, లలిత కుమారి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# చట్ట ప్రకారం విచారణ జరిపి న్యాయం చేస్తాం

**– జిల్లా అడిషనల్ ఎస్‌పి సిహెచ్.సౌజన్య**



**నెల్లూరు, జూన్ 8, ప్రభాతవార్త – క్రైం:** ప్రజా సమస్యలను సత్వరంగా పరిష్కరించడంతో పాటు, ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా విచారించి న్యాయం చేయాలని జిల్లా అడిషనల్ ఎస్‌పి సిహెచ్ సౌజన్య సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజా వినతులు పునరావృతం కాకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా అడిషనల్ ఎస్పీ, ఇతర అధికారుల సమక్షంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి 133 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏఎస్పి మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పట్ల ఎలాంటి అలసత్వం ప్రదర్శించరాదని, ప్రజలతో మర్యాదపూర్వకంగా, జవాబుదారీతనంతో వ్యవహరించాలన్నారు. ప్రతి పిటిషన్‌ను సమగ్రంగా విచారించి త్వరితగతిన పరిష్కరించాలని, బాధితులకు చట్టపరమైన న్యాయం అందేలా చర్యలు చేపట్టాలన్నారు. వేదాయపాలెం పోలీస్ స్టేషన్‌కు చెందిన పిర్యాది, విజయ భాస్కర్ రెడ్డి అనే వ్యక్తి పిర్యాదితో పేస్ బుక్ ద్వారా పరిచయం చేసుకొని సాఫ్ట్ వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని పిర్యాది వద్ద నుంచి రూ.12,65,000లు తీసుకొని నకిలీ జాబ్ ఆఫర్ లెటర్ ఇచినట్టు,అడిగితే బెదిరిస్తునట్టు విచారించి న్యాయం చేయమని పిర్యాది కోరారు. నెల్లూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన వృద్దురాలైన పిర్యాది, తనకున్న ఆస్తిని కూతురు, కొడుకులు పంచుకొని తనకు జీవనాధారంగా ఉన్న ఇంటిపై తన కుమారుడు, కోడలు అప్పుచేసి తనని పట్టించుకోకుండా, తన ఆరోగ్య పరిస్థితి బాగోలేదు అని, విచారించి న్యాయం చేయమని పిర్యాది కోరారు. కోవూరు పోలీస్ స్టేషన్‌కు చెందిన పిర్యాది, తన భర్త చెడు వ్యసనాలకు బానిసై తనను మానసికంగా, శారీరకంగా ఇబ్బంది పెడుతు నట్టు, పిలిపించి విచారించి న్యాయం చేయమని పిర్యాది కోరారు. అడిషనల్ ఎస్‌పి మాట్లాడుతూ వచ్చిన ప్రతి ఫిర్యాదుపై చట్టపరంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.డీటీసీ డిఎస్‌పి గిరిధర్, యస్పి డిఎస్‌పి ధీరజ్ వినీల్, ఉమెన్ పీఎస్ సీఐసుబ్బారావు, పిసిఆర్ సీఐభక్తవత్సలరెడ్డి, పీజీఆర్ఎస్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

# మున్సిపల్ తాగునీటిని పరిశీలించిన కమిషనర్ వైఓ.నందన్



**నెల్లూరు కార్పోరేషన్, జూన్ 8 ప్రభాతవార్త :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ.నందన్ స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలోని హెడ్ వాటర్ వర్క్స్‌ను అధికారులతో కలిసి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్ నుంచి తాగునీటి శ్యాంపిల్లను సేకరించి నాణ్యత పరీక్షలను కమిషనర్ సమక్షంలో పిపిఎం కిట్ల ద్వారా అధికారుల నిర్వహించారు. ఫలితాల అనంతరం తాగునీటి రందు, వాసనలను కమిషనర్ పరిశీలించి నీటిని తాగిన అనంతరం సంతృప్తిని వ్యక్తం చేశారు. తాగునీటి నాణ్యతపై ప్రజలకు ఏమైనా సందేహాలు ఉంటే ఓవర్‌హెడ్ వాటర్‌ట్యాంకుల వద్ద క్రమం తప్పకుండా జరిపే తాగునీటి పరీక్షలను స్వయంగా పరిశీలించవచ్చని కమిషనర్ ప్రకటించారు. నెల్లూరు నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ రహంతుజానీ, అమెనిటిస్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పైనాపురంలో కార్డ్ అండ్ సర్చ్

**– పోర్ట్ ఎస్ఐ శ్రీనివాసులు రెడ్డి**



**ముత్తుకూరు, జూన్ 8, ప్రభాతవార్త** జిల్లా ఎస్పి ఆదేశాల మేరకు మండలంలోని పైనాపురం పంచాయితీలో సోమవారం కార్డ్ అండ్ సర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ గ్రామస్తులతో మాట్లాడుతూ ఆస్తుల తగాదాలు, ఆన్‌లైన్ బెట్టింగులు, మోసాలు, రోడ్డు సేఫ్టీ, శక్తి యాప్‌లపై అవగాహన కల్పించారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. గ్రామాల్లో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా తాము, తమ సిబ్బంది ఎల్లప్పుడు పర్యవేక్షిస్తుంటామని అన్నారు. పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# విశ్వకర్మ భగవాన్ విగ్రహ ప్రతిష్టాపనకు అనుమతి మంజూరుకు వినతి



**నెల్లూరు కార్పోరేషన్, జూన్ 8 ప్రభాతవార్త** :నెల్లూరు నగరంలోని పాత మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో శ్రీ విశ్వకర్మ భగవాన్ వారి విగ్రహ నిర్మాణంకు ప్రతిష్టాపనకు అనుమతి మంజూరు చేయాలని సోమవారం కార్పోరేషన్ కమిషనర్‌కు బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్ సింగ్ వినతి పత్రం అందజేశారు. ఈసదర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ విశ్వకర్మ భగవాన్ వారు శిల్పకారులు, వృత్తి నిపుణులు కార్మికులు, స్వర్ణకారులు, ఇంజనీర్లు ఆరాధ్యదైవంగా ప్రసిద్ది చెందారు. ఈ విగ్రహ ప్రతిష్టాపన ద్వారా ప్రజల ఆధ్యాత్మిక బావనలు పెంపొందిచడంతో పాటు సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు దోహదపడు తుంద న్నారు. ఈ ప్రాంతంలో సుమారు 10వేల మది స్వర్ణకారుల తమ వృత్తిని నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి ఏడాది సెప్టెంబర్ 17న శ్రీ విశ్వకర్మ జయంతిని నిర్వహిస్తారని తెలిపారు. ఈ నేపథ్యంలో పాత మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో శ్రీ విశ్వకర్మ భగవాన్ విగ్రహం ఏర్పాటు చేయడం వల్ల వేలాది మంది స్వర్ణకారులు, భక్తులకు అధ్యాత్మిక కేంద్రంగా ఉపయోగపడుతుందని వివరించారు. అవసరమైన సంబందిత నిబంధనలు, షరతులు, చట్టాలను పూర్తిగా పాటించడానికి మేము కట్టుబడి ఉన్నామని తెలిపారు.

# ప్రభుత్వ నిరుకుశ వైఖరి పై విఆర్‌ఓలు నిరశన



**కోట,జూన్ 8 ప్రభాతవార్త** పనిభారంతో విఆర్ఓలు తీవ్ర ఒత్తిళ్లకు గురవుతున్నారని కోట మండల విఆర్ఓ అసోసియేషన్ అధ్యక్షులు కృష్ణయ్య ఆరోపించారు. ఆమేరకు సోమవారం భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జెలు ధరించి నిరశన తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ కర్నూల్ సచివాయం ఉద్యోగి మహమ్మద్ హుసేన్ కేవలం ఒత్తిడి కారణంగానే మృతి చెందారని ఆయన ఆరోపించారు. ఒక పని తర్వాత మరో పనిచేయడానికి తాము సిద్దమేనని అయితే ప్రభుత్వం అన్ని పనులు ను ఒకే సారి చేయాలని ఒత్తిడి చేసి ఉద్యోగుల చావులకు కారణం కావోద్దని ఆయన కోరా రు.సర్వే లు, ఎన్నికల సంబంధిత బాధ్యతలు కూడా నిర్వర్తిస్తున్నామని పేర్కొన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియలో బీఎల్‌వోలుగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ఇతర విధుల నుంచి పూర్తి మినిహ యింపు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికీ అనేక మంది ఉద్యోగులు తీవ్రమైన ఒత్తిడతో ఆత్మ హత్యలకు పాల్పబడుతన్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తహిసీల్దార్ కె.జయజయరావుకు వినతి పత్రం అందచేశారు. ఈ నిరశనలో సుబ్రమణ్యం, చిరంజీవి, శ్రీనివాసులు, పాల్గొన్నారు.

# పేదలకు కుళాయిలు వేయించమంటే విజిలెన్స్ ఎంక్వరీ అంటావు...

**మాజీ ఎమ్మెల్యేపై రెచ్చిపోయిన టిడిపి నాయకులు**



**కావలి, జూన్ 8 ప్రభాతవార్త** :అమృత పథకంలో దోచుకున్న 14కోట్లు రుపాయల సొమ్ముతో పేదలకు కుళాయిలు వేయించమంటే ఎంక్వయిరీ అంటావని కావలి టిడిపి నాయకులు పలువురు మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిపై విరుచుకుపడ్డా రు.టిడిపి కార్యాలయంలో సోమవారం ఏర్పా టుచేసిన విలేకర్ల సమావేశంలో టిడిపి నాయకులు దేవరకొండ శ్రీనివాసులు, దావులూరి దేవకుమార్, పసుపులేటి బాబూరావు, సయ్యద్‌రెహమాన్, జంపాని ప్రసాద్, చవల రామక్రిష్న తదితరులు మాట్లాడారు. ఎమ్మెల్యే అమృత పథకం 2 స్కీమ్ ప్రారంభిస్తూ గతంలో అమృత 1 స్కీమ్‌లో చోటు చేసుకొన్న అవినీతిపై మాట్లాడితే ఎందుకు మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి భయపడుతున్నారని ప్రశ్నించారు. నాడు, నేడ కావలి అభివృద్దిని చూస్తే ఎంతగా అభివృది చెందిదో ప్రజలే చెబుతారని తెలిపారు. రెండేళ్లుగా కావలి ఎమ్మెల్యే పూర్తి చేసిన పనులు గమనిస్తే ఇప్పటి వరకు ఏ ఎమ్మెల్యే చేయని అభివృద్దిని చేసి చూపాడు అని తెలిపారు. ఎమ్మెల్యేగా క్రిష్ణారెడ్డి గెలిచిన ఆరునెలల్లో కావలి కనకపట్నంగా తీర్చిదిద్దబడిందన్నారు. మనీ స్కాం గురించి సుభానితో నీకు ఉన్న సంబంధాన్ని బట్టి ఆయనకు స్థావరం చూపించి ఆ ఇంటి వద్దకు నీ ప్రభుత్వంలో రోడ్డు కూడా చేయించడం జరిగిందన్నారు. నీవు కావలి ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి కాళ్ళు కడగటం కాదు, నీవు చేసిన అవినీతి బాగోతం బయటకు వస్తే వాటిని నీవు ఒప్పుకుని ప్రజలకు న్యాయం చేస్తావు, చేయిస్తాము , అప్పుడు నీకు ముసునూరు మర్రిచెట్లు వద్ద కాళ్ళు కడుగుతాము అన్నారు. మా ఎమ్మెల్యేకి రేపు టికెట్ రాదు అంటావు, లోకేష్ గురించి మాట్లాడుతావు, నీకు మతిపోయి మాట్లాడుతున్నావు. చంద్రబాబునాయుడు మా ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి లాంటి వారు కావలి టిడిపికి దొరకడం అదృష్టం అని అనడం జరిగిందన్నారు. 2019-24లో ఏఈ అధికారంలో జరగనన్నలేవుట్లపై జరిగిన అవినీతి ఎంతటిదో అందరికి తెలుసని అన్నారు. ప్రస్తుతం విజిలెన్స్ దాడుల వల్ల కొనుగోలుదారులు పేదలు నష్టపోతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైద్యఖర్చుల నిమిత్తం బెస్ట్ వాకర్స్ పదివేల ఆర్థికసాయం



**కావలి, జూన్ 8 ప్రభాతవార్త :** శరణ్య అనే మహిళకు గర్భసంచి ఆపరేషన్ చేసినందన వారి కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండడంతో బెస్ట్ వాకర్స్ ఆధ్వర్యంలో సోమవారం వైద్యఖ ర్చులు నిమిత్తం 10వేలు ఆర్తికసాయం చేయడం జరిగింది. బెస్ట్ వాకర్స్‌కు శరణ్య కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. బెస్ట్ వాకర్స్ అధ్యక్షుడు టీవి.శేషయ్య, సెక్రటరీ మంద వెంకటేశ్వర్లు, బత్తిన శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్ కుమార్, వెంకయ్య ఏఎస్ఐ సుబ్బయ్య సుంకు క్రిష్ణ, జోగి క్రిష్ణ రామ్, గోపాల్ పాస్టర్ ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# డీఎస్సీ అక్రమాలపై విచారణ చేపట్టండి



**నెల్లూరు–కలెక్టరేట్ , జూన్ 8, ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ నిర్వహణలో పలు అక్రమాలకు పాల్పడిందని నిర్వహణలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించాలని వైఎస్ఆర్సిపి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పందిటి కామరాజ్ సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని తిక్కన ప్రాంగణంలో జరిగిన ప్రజా విజ్ఞప్తుల దినంలో కలెక్టర్ హిమాన్షు శుక్ల వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పెద్ద ర్యాలీగా బయలుదేరి వచ్చి విలేకరులతో మాట్లాడుతూ డీఎస్సీలో జరిగిన అక్రమాలను సిబిఐ వెలికి తీయించాలన్నారు విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని అన్నారు. అర్హులైన నిరుద్యోగులకు ఉద్యోగం కల్పించాలని డిమాండ్‌తో ఈ ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ దగా డీఎస్సీలో ర్యాంకు వచ్చిన వారికి కూడా ఇవ్వకుండా అనేక స్పోర్ట్స్ జీవోలు తీసుకొని వచ్చి యువతకు తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు. డీఎస్సీ కాకుండా ఎస్ ఆర్‌టితో నిర్వహించడం పలు ఆపోహాలకు తావిస్తుందన్నారు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంబంధించిన రిజర్వేషన్ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు మెరిట్ లిస్టులో ఓపెన్ క్యాటగిరిలో మంచి మార్కులు సాధించిన వారికి పోస్టులు దక్కలేదన్నారు. యూనివర్సిటీల చేత స్పోర్ట్స్ సర్టిఫికెట్లను పొందిన వారికి ఉద్యోగాలు కేటాయించారన్నారు. 48 ఆరు కేటగిరీల్లో స్పోర్ట్స్ కేటా కింద అందించారన్నారు. దీనిపై సిబిఐ విచారణ జరిపించాలన్నారు. జగన్మోహన్ రెడ్డి అనేక పోస్టులను సృష్టించి సచివాలయ వ్యవస్థలు తీసుకొని వచ్చిన ఏ విధమైన జీవులను సృష్టించకుండా పారదర్శకంగా ఉద్యోగాలు ఇస్తే దానికి వ్యతిరేకంగా దేశం ప్రభుత్వం అక్రమాలకు పాల్పడుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో వైయస్సార్సీపి ఎస్సీ సెల్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు దోపిడీలను అరికట్టండి



**నెల్లూరు–కలెక్టరేట్ , జూన్ 8, ప్రభాతవార్త** నెల్లూరు నగరంలో సామాన్య మధ్యతరగతి ప్రజలపై అతి భారంగా ఉన్న ప్రైవేటు కార్పొరేట్ స్కూల్ లలో ఫీజులు బుక్ ఫీజులు దందా అధికంగా ఉందని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ ఉల్లిపాయల మురళీకృష్ణ యాదవ్ సోమవారం కలెక్టర్ కార్యాలయం తిక్కన ప్రాంగణంలో జరిగిన ప్రజా విజ్ఞప్తులదినంలో కలెక్టర్ హిమాన్ష్ శుక్లాకు వినతి పత్రం సమర్పించారు. మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన విద్యా హక్కు చట్టం 25 ఫ్రీస్ సీట్లు అన్ని కార్పొరేట్ ప్రైవేటు స్కూళ్లలో అమలు చేయలేదన్నారు. వారిపై కఠిన చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ప్రైవేటు స్కూళ్లలో 5000 నుంచి 7000 వరకు వసూలు చేస్తున్నారని కార్పొరేట్ స్కూల్ లలో 10 నుంచి 15 వేల వరకు వసూలు చేస్తున్నారన్నారు యూనిఫామ్ పేరుతో అమలు అయ్యేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేయాలన్నారు.

# బీహార్ రోడ్డు ప్రమాదంలో యాత్రికులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం

**– జిల్లా టిడిపి అధ్యక్షులు బీదరవిచంద్ర**

**నెల్లూరు, జూన్ 8, ప్రభాతవార్త – వైద్యం:** బీహార్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో నెల్లూరు జిల్లాలోని సంగం గ్రామానికి చెందిన యాత్రికులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని, శాసన మండలి సభ్యులు, జిల్లా టిడిపి అధ్యక్షులు బీద రవిచంద్ర విచారం వ్యక్తం చేశారు.ఆయన సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీహార్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో నెల్లూరు జిల్లాలోని సంగం గ్రామానికి చెందిన యాత్రికులు ప్రాణాలు కోల్పోవడం తనను దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానన్నారు. భగవంతుడు వారికి మనోధైర్యం ప్రసాదించాలని కోరుకుంటున్నానని తెలిపారు. రోడ్డు ప్రమాదంలో గాయలపాలైన బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాని, వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నానన్నారు. ప్రమాదంకు గల కారణాలను సంబంధిత అధికారులతో కూటమి ప్రభుత్వం సమీక్షిస్తోందని ఆయన పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

# వీర వృద్ధుల ఆశ్రమంలో న్యాయ విజ్ఞాన సదస్సు



**నెల్లూరు, జూన్ 8, ప్రభాతవార్త – వైద్యం** నెల్లూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీనివాస్ ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వైజె. పద్మశ్రీ ఆధ్వర్యంలో మాగుంట లేఔట్‌లోని వీర వృద్ధుల ఆశ్రమంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వై.జె.పద్మశ్రీ వృద్ధులను ఉద్దేశించి మాట్లాడుతూ తల్లిదండ్రులను కుటుంబంలోని ఇతర వయోవృద్ధులను వృద్యాప్యంలో నిర్లక్ష్యం చేయడం హేయకరమైన చర్య అన్నారు. ఈ విషయం బిడ్డలను పెంచి, విద్యాబుద్ధులకు చెప్పించి ప్రయోజకులను చేసిన తల్లిదండ్రులను, వృద్ధులను నిర్లక్ష్యం చేయరాదన్నారు. చాలామంది నిర్లక్ష్యం చేయటం, ఇంటి నుండి బయటకు గెంటి వేయడం జరుగుతుందన్నారు. వృద్ధాప్యంలో ఇలాంటి వారి రక్షణ కోసం 2007 సంవత్సరంలో తల్లిదండ్రుల సీనియర్ సిటిజన్ల పోషణ సంక్షేమ చట్టం అమలులోకి వచ్చిందని గుర్తు చేశారు. తల్లిదండ్రుల పోషణ భారం,వారి బిడ్డలు, మనుమలు, మనుమరాలు లేదా వారి నుండి ఆస్తులను పొందే అవకాశం ఉన్న బంధువులందరికీ అని తెలిపారు. అలాగే మీకు ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు లేని వారు మాకు తెలిపితే మేము ఉన్నతాధికారులకు తెలిపి మీకు రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు వచ్చేటట్లు చేస్తామని తెలిపారు. అలాగే వాళ్లకు అందుతున్న భోజనం, వసతులు, వసతి గృహం,బాత్రూమ్స్, వైద్య సదుపాయం గురించి వివరంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం వృద్ధులకు అరటి పండ్లు పంచి పెట్టారు. తదనంతరం లీగల్ ఎయిడ్ క్లినిక్ హెల్ప్ డస్క్ ఓపెన్ చేశారు. ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్ సిబ్బంది, పేరా లీగల్ వాలంటరీ కోటేశ్వరరావు, పెసల వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల భూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి



**కావలి, జూన్ 8 ప్రభాతవార్త :** రైతుల భూ సమస్యలను పరిష్కరించడంలో రెవెన్యూ అధికారులు తక్షణమే నిర్లక్ష్యాన్ని వీడి భాది తులకు న్యాయం చేయాలని బిజెపి డిమాండ్ చేసింది ఆపార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రజావిజ్ఞప్తుల వేదిక జనతా వారధి కార్య క్రమంలో భాగంగా కావలి ఒకటవ పట్టణ శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో భూ సమస్యలపై వినతిపత్రం ఇచ్చారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు గుండ్లపల్లి భరత్‌కుమార్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులు అనుసరిస్తూ ఆలసత్వ దోరణి వల్ల సామాన్య రైతులు కార్యాలయాల చుట్టూ తిరగలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అధికారులు వెంటనే స్పందించి రైతులకు హక్కుల కల్పించాలని కోరారు. కుట్టుబోయిన బ్రహ్మానందం మాట్లాడుతూ రెవెన్యూ విభాగంలో జరుగుతున్న అక్రమాలను లోపాలను తీవ్రంగా ఎండగట్టారు. రైతుల వద్ద డిజిటల్ సంతకాలు, అడంగల్లు, వన్‌బి ఈ రిజిస్ట్రేషన్లు వంటి ప్రభుత్వ అధికారిక పత్రాలు ఉన్నప్పటికి కేవలం ఎంజాయమెంటు అనే సాకును అడ్డం పెట్టుకొని కొందరు అధికారుల కావాలనే సమస్యలను సృష్టిస్తున్నారు. ఇది ముమ్మాటికి ధళారులకు, భూ మాఫియాకు సహకరించడమేనని ఆరోపించారు. గ్రామసభలు, కేవలం అధికారుల హాజరు శాతాన్ని చూపించుకోవడానికే పరిమితమయ్యాయి అన్నారు. అర్హులైన ప్రతి రైతుకు భూ హక్కు పత్రాలు సజావుగా అందేలా చూడాలని లేనిపక్షంలో బిజెపి ఆధ్వర్యంలో ప్రజాపోరాటాలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు మంద కిరణ్‌కుమార్, జీఎస్‌టి మండలి సభ్యులు అమరా వెంకటసుబ్బారావు, బిజెవైఎం పట్టణ ప్రధాన కార్యదర్శి దేవాండ్ల రాకేష్, మోర్ల బార్గవ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# గంధ మహోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే



**కావలి, జూన్ 8 ప్రభాతవార్త** :పట్టణంలో ఈనెల 12నుంచి 14వరకు జరగనున్న హాజరత్ సయ్యద్ పక్రుద్దిన్ బాబా ఉరఫ్ పుట్టేషావలి పీర్ రహమతుల్లాహి అలైహి వారి గంధ మహోత్సవంకు రావాలని సోమవారం దర్గా నిర్వాహకులు ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డిని టిడిపి కార్యాలయంకు వెళ్ళి మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వానం పలికారు. అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా మహోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. గంద మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించాలని ఈ కార్యక్రమం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ నిర్వాహకులు, సభ్యులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## 12 న జరిగే నిరసన ర్యాలీని జయప్రదం చేయండి

### ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్



**గూడూరు, జూన్ 8, ప్రభాతవార్త** రాష్ట్రంలో పరిపాలిస్తున్న ప్రస్తుత ప్రభుత్వం గడిచిన రెండు సంవత్స రాలలో ఒక కొత్త పెన్షన్ కూడా మంజూరు చేసిన దాఖలాలు లేవని గూడూరు నియోజకవర్గం వైసిపి ఇంచార్జ్, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ విమర్శించారు. పట్టణంలోని వైసిపి కార్యాలయంలో ఎమ్మెల్సీ మురళీధర్ విలేకరుల సమావేశం నిర్వహించారు. గూడూరు పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ మురళీధర్ వైసీపీ నాయకులతో సమావేశం నిర్వహించి పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్య లపై చర్చించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు హామీగా ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు సంపూర్ణంగా అమలు కావడం లేదని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శిం చారు. వైసిపి ప్రభుత్వ హయాంలో మంజూరైన మెడికల్ కాలేజీలను టిడిపి ప్రభుత్వం ప్రైవేట్ పరం చేస్తూ పేద ప్రజలకు వైద్య సదుపాయాలు దూరం చేస్తున్నారని ఆయన విమర్శించారు. టిడిపి ఇచ్చిన హామీల్లో భాగంగా నిరుద్యోగ యువతకు హామీ ఇచ్చిన నిరుద్యోగ భృతి ఎందుకు ఇవ్వడం లేదని ఆయన ప్రశ్నించా రు. 12వ తేదీన ప్రజల పక్షాన వైసిపి నిరసన ర్యాలీ నిర్వహిస్తుందని ఈ ర్యాలీలో వైసీపీ శ్రేణులు అందరూ పాల్గొని ప్రజల నిరసనను ప్రభుత్వానికి తెలియజేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గూడూరు నియోజవర్గ పరిధిలోని పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## అధిక యూరియా... అనర్థమే: గూడూరు ఏడి గోపి నాయక్



**గూడూరు, జూన్ 8, ప్రభాతవార్త** గూడూరు మండల పరిధిలోని తిప్పవరప్పాడు రైతు సేవాకేంద్రంలో ఇంటింటికి కేత్ బచావో అభియాన్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గూడూరు సహాయ వ్యవసాయ సంచాలకులు బి.గోపీ నాయక్‌హాజరై, రైతులు పంట మోతాదును అనుసరించి ఎరువులు వాడాలని, అతిగా యూరియా వాడితే కాన్సర్ బారిన పడతామని తెలియజేశారు. అనంతరం గూడూరు మండల వ్యవసాయ అధికారి వి.రమేష్ మాట్లాడుతూ పెరుగుతున్న యూరియా వాడకాన్ని తగ్గించడానికి మన రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఎరువుల విక్రయాలను ఏపీ ఏఐఎంఎస్ 2.0 యాప్ ద్వారా జరపాలని సూచించిన కారణంగా ప్రతి డీలర్ యాప్ ద్వారానే యూరియా, డిఏపి ఎరువుల విక్రయాలు జరపాలని, రైతు సోదరులు సహకరించి మోతాదును అనుసరించి ఎరువులు వాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారిని యన్.సునీత, ఉద్యాన సహాయకురాలు పూజిత, రైతులు పాల్గొన్నారు.

## బీహార్ రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలి

### - జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నారపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి

**నెల్లూరు, జూన్ 8, ప్రభాతవార్త – అగ్రికల్చర్** బీహార్‌లోని ఔరంగాబాద్ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో సంగం మండలానికి చెందిన ఇద్దరు, నెల్లూరుకు చెందిన ఒకరు మొత్తం ముగ్గురు భక్తులు మృతి చెందడం పట్ల నెల్లూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారపరెడ్డి కిరణ్‌కుమార్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆత్మకూరు నియోజకవర్గం పరిధిలోని సంగం ప్రాంతం నుంచి 43 మంది యాత్రికులతో గయా, వారణాసి పుణ్యక్షేత్రాల దర్శనానికి బయలుదేరిన ప్రైవేటు బస్సు ప్రమాదానికి గురై ముగ్గురు ప్రాణాలు కోల్పోవడం విషాదకరమని ఆయన పేర్కొన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ దుర్ఘటన బాధిత కుటుంబాలకు తీరని లోటన్నారు. ప్రమాదంలో గాయపడిన యాత్రికులు త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. వారికి అవసరమైన వైద్య సేవలు అందేలా అధికార యంత్రాంగం నిరంతరం పర్యవేక్షించాలని డిమాండ్ చేశారు. ఈ క్లిష్ట సమయంలో బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల అండగా నిలవాలని అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ తరపున పూర్తిగా అండగా ఉంటామన్నారు.

## పంచ్ ప్రభాకర్ పై ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు అమర్తలూరు చెంచయ్య ఆధ్వర్యంలో పోలీసులకు ఫిర్యాదు



**పొదలకూరు, జూన్ 8, ప్రభాతవార్త** చినిపల్లి ప్రభాకర్ రెడ్డి అలియాస్ పంచ్ ప్రభాకర్ పై ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు అమర్తలూరు చెంచయ్య ఆధ్వర్యంలో పోలీసులకు పిర్యాదు చినిపల్లి ప్రభాకర్‌రెడ్డి అలియాస్ పంచ్‌ప్రభాకర్ అనే వ్యక్తి యూట్యూబ్,వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్,ఇతర సోషల్ మీడియా వేదికల ద్వారా ఆర్యవైశ్య సమాజాన్ని, ఆ సమాజ నాయకులను, కుల పెద్దలను లక్ష్యంగా చేసుకొని అసత్య, అవమానకర, దూషణాత్మక, విద్వేషపూరిత వ్యాఖ్యలు, వీడియోలు రూపంలో పోస్టులను గత కొంత కాలంగా ప్రచారం చేస్తున్నాడని ఎస్ఐ హనీఫ్‌కి పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచ్ ప్రభాకర్ అనే వ్యక్తి ఆర్యవైశ్య సమాజ ప్రతిష్టను దెబ్బతీయడానికి ఉద్దేశపూర్వకంగా ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తుందన్నారు. ఈ చర్యల వల్ల సమాజంలో ఉద్రిక్తతలు, విభేదాలకు, శాంతిభద్రతలకు భంగం కలిగే అవకాశం ఉందన్నారు. ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు రూరల్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు అమర్తలూరు చెంచయ్య ఆధ్వర్యంలో పొదలకూరు పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ హనీఫ్‌ని కలిసి పంచ్ ప్రభాకర్ ఆర్యవైశ్యుల్ని తీవ్రంగా దూషించిన వీడియోలను చూపించి అతనికి పెన్ డ్రైవ్ రూపంలో ఇవ్వడం జరిగింది. వీరు ఇవన్నీ పరిశీలించి పంచ్ ప్రభాకర్ మీద ఖఠినమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు రూరల్ అధ్యక్షులు అమర్తలూరు చెంచయ్య, ఏఎంసి డైరెక్టర్ పిన్నెల ప్రభాకర్, తన్నీరు సురేష్‌బాబు, గుర్రం మీరా మధు, ఆకులూరు విజయకుమార్, వడ్లపూటి శ్రీనివాసులు, వాకాటి ప్రసాద్, పైడా కామేష్ ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

## తల్లి ఆశలన్నీ ఆవిరి

### - విద్యుత్ తీగ తొక్కిబాలుడు మృతి, వింజమూరులో విషాదం



**వింజమూరు, జూన్ 8, ప్రభాతవార్త** కన్న కొడుకు ఎదిగొచ్చి ఆసరాగా నిలుస్తాడనుకున్న తల్లి ఆశలు క్షణాల్లో ఆవిరయ్యాయి. వింజమూరు పట్టణంలోని చల్లా వారి వీధిలో సోమవారం చోటుచేసుకున్న విద్యుదాఘాత ఘటన అందరి హృదయాలను ద్రవింపజేసింది. చల్లా వారి వీధిలో నివాసం ఉంటున్న పేర్నేటి రాజా మమత దంపతుల కుమారుడు మహిదర్ రెడ్డి (13), 9వ తరగతి చదువుతున్నాడు. సోమవారం వారి ఇంటి పక్కనే పాతబిల్డింగును కూల్చివేస్తుండగాకు తూహలంతో హేమంత్ అక్కడికి వెళ్లి చూస్తున్నాడు. ఆసమయంలో డ్రిల్లింగ్ మిషన్‌కు సరఫరా అవుతున్న కరెంటు తీగ నేలపై ఉంది. చెప్పులు లేకుండా వెళ్లిన హేమంత్ పొరపాటున ఆ తీగను తొక్కడంతో ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. అమ్మా అంటూ కింద పడిపోయాడు. అక్కడ పనిచేస్తున్న కూలీలు వెంటనే మహిధర్ రెడ్డిని వింజమూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కానీ అప్పటికే బాలుడు ప్రాణాలు విడిచినట్లు వైద్యులు నిర్ధారించారు. కొడుకు మృతదేహాన్ని చూసి తల్లి మమత గుండెలవిసేలా రోధించింది. మహిధర్ రెడ్డి తండ్రి కొన్నేళ్ల క్రితమే ఇల్లు వదిలి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి తల్లి మమత కూలి పనులు చేస్తూ ఇద్దరు బిడ్డలను సాకుతోంది. రెక్కలు ముక్కలు చేసుకుని ఇద్దరినీ చదివిస్తున్నా, పెద్దవాడే నా ఆసరా అనుకున్నా, ఇప్పుడు వాడూ లేకుండా పోయాడు అంటూ ఆ తల్లి కన్నీరు మున్నీరుగా విలపిస్తుంటే చూపరుల హృదయాలు బరువెక్కాయి. మహిధర్ మృతితో చల్లావారి వీధితో పాటు పరిసర ప్రాంతాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ఉమా మహేశ్వర తెలిపారు.

## కాశీయాత్ర బస్సు ప్రమాదంపై మేకపాటి విక్రమ్‌రెడ్డి దిగ్భ్రాంతి



**ఆత్మకూరు ,జూన్8,ప్రభాతవార్త:** నెల్లూరు జిల్లా నుంచి ఉత్తర భారత దేశ యాత్రలో భాగంగా కాశీకి బయలుదేరిన ప్రవేటు బస్సు బీహార్ రాష్ట్రంలోని ఔరంగాబాద్ సమీపంలో అర్ధరాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యాత్రికులు మృతిచెందడం, పలువురు గాయపడడం పట్ల ఆత్మకూరు నియోజ కవర్గ మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో సంగం మండలానికి చెందిన ఇద్దరు, ఆత్మకూరుకు చెందిన ఓ మహిళ మృతిచెందడం అత్యంత విషాదకరమని ఆయన పేర్కొన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ వారి కుటుంబాలకు ఈకష్టకాలంలో ధైర్యం ప్రసా దించాలని భగవంతుడిని కోరారు. ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాం క్షించారు. బాధితులకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని సంబంధిత అధికారులను కోరారు. యాత్రకువెళ్ళినమిగతా భక్తులు క్షేమంగా స్వస్థలాలకు చేరుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయనకోరారు. ఈనెల 1వ తేదీన నెల్లూరు జిల్లా నుంచి ఉత్తర భారతదేశ యాత్రకు బయలుదేరిన ప్రవేటు బస్సులో ఆత్మకూరు,సంగం,దుత్తలూరు ప్రాంతా లకు చెందిన 43మంది యాత్రికులు ఉన్నట్లు సమాచారం. గయాదర్శనం అనంతరం వారణాసికివెళుతున్న సమయంలోఈ ప్రమాదం చోటుచేసుకోవడం తీవ్రవిషాదాన్ని మిగిల్చిందని మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు.

## నెల్లూరు జిల్లా యాత్రికల మృతిపై హోంమంత్రి అనిత దిగ్భ్రాంతి

**కోట,జూన్ 8 ప్రభాతవార్త** బిహార్ రోడ్డు ప్రమాదంలో నెల్లూరు జిల్లా యాత్రికల మృతి పై హోంమంత్రి అనిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తీర్ద యాత్రకు వెళ్లి ముగ్గురు ప్రాణాలు కోల్పవడం విషాదకరమని చెప్పారు. క్షతగాత్రులతో ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు. యాత్రికులు స్వస్ధలాలకు చేరేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నట్లు హోంమంత్రి అనిత వెల్లండించారు. మృతుల కుటుంబాలకు ప్రగాడ సానుభూతి తెలిపారు.

## జలధార పరమేశ్వర స్వామికి వైభవంగా పూజలు



**కోవూరు, జూన్8 ప్రభాతవార్త** కోవూరు మండలం పోతిరెడ్డి పాలెం గ్రామ పరిధిలోని పెన్నానది తీరాన వెలసి ఉన్న శ్రీ జలధార పరమేశ్వరస్వామి, శ్రీఇష్టకామేశ్వరి అమ్మవారి ఆలయంలో సోమవారం విశేష పూజల కార్యక్రమాలను కన్నులపండువగా నిర్వహించారు. పవిత్ర సోమవారం పర్వదినాన్ని పురస్కరిం చు కుని ప్రాత:కాలము నుంచే స్వామి అమ్మవార్లకు శాస్త్రోక్తంగా అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవతామూ ర్తులను వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.ఈ వేడుకలకు ఉభయకర్తగా పారిశ్రామికవేత్త జేఎల్ సత్యం వ్యవహరించగా.. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటీ సభ్యులు గాది రాజు భాస్కర్ రావు, కలికిశ్రీధర్‌రెడ్డి, పిగిలం సుధాకర్, రేబాలరమణారెడ్డి, ఏఎస్సై శ్రీనివాసులు, నందకుమార్, కైలాసం శ్రీనివాసులు, విజయ్, శ్రావణ్, జాతీయ స్విమ్మర్ హరిసింగ్, ఉన్నారు.



### గ్రామ పంచాయితీ కార్యాలయము, వరిణి

విడవలూరు మండలం, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

ఆర్.ఓ.సి.నెం.01/2025 **టెండరు ప్రకటన** తేది: 25.03.2026

శ్రీపొట్టిశ్రీరాముల నెల్లూరు జిల్లా, విడవలూరు మండలము, వరిణి గ్రామ పంచాయితీలో 01-04-2026 నుండి 31-03-2027 వరకు ఒక సంవత్సరకాలానికి క్రింది పోస్టులకు టెండర్లు ఆహ్వానించబడుచున్నవి.

| వ.నెం. | టెండర్ వివరములు | పోస్టు | ధరావత్తు |
|---|---|---|---|
| 1 | తాత్కాలిక PWS ఆపరేటర్ పోస్టులు (01-04-2026 నుండి 31-03-2027 వరకు) | 2 | రూ.100/- |
| 2 | తాత్కాలిక ఎలక్ట్రిషియన్ పోస్టులు (01-04-2026 నుండి 31-03-2027 వరకు) | 1 | రూ.100/- |
| 3 | తాత్కాలిక బిల్ కలెక్టర్ పోస్టులు (01-04-2026 నుండి 31-03-2027 వరకు) | 1 | రూ.100/- |

పై టెండర్లు 16-06-2026 తేదీ ఉదయం 10.30 గంటల వరకు స్వీకరించబడును. అదే రోజు సాయంత్రం 4.00 గంటలకు టెండర్లు తెరవబడును. ఇతర వివరాలు కార్యాలయ పనివేళలలో తెలుసుకొనగలరు. ప్రభుత్వ సేవలో ఉన్న అభ్యర్థులు సంబంధిత ధృవపత్రాలు సమర్పించవలెను.

సం/- పంచాయితీ కార్యదర్శి, వరిణి గ్రామ పంచాయతి, విడవలూరు మండలము, SPSR నెల్లూరు జిల్లా

## ప్రకృతి ఆహారమే ఆరోగ్యానికి మేలు : తహశీల్దార్ స్ఫూర్తి రెడ్డి



**కొడవలూరు, జూన్ 8, ప్రభాతవార్త :** మండల తహశీల్దార్ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంతో పండించిన పంటల అమ్మకాల కోసం ప్రత్యేక స్టాల్ను ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఏర్పాటు చేశారు. రైతుల నుంచి నేరుగా వినియోగదారులకు వివిధ రకాల ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించారు. తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన ఆహార పదార్థాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. రసాయన రహిత ఆహారాన్ని వినియోగించడం ద్వారా అనేక ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీసీఎన్ఎఫ్. ఐ సి ఆర్ పిలు, రైతులు పాల్గొన్నారు.

## ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావులేదు : తహశీల్దార్



**కొడవలూరు, జూన్ 8, ప్రభాతవార్త :** ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు అత్యంత బాధ్యతతో వ్యవహరించాలని, ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించినా ఉపేక్షించబోమని తహశీల్దార్ కె. స్ఫూర్తిరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ వేదికను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివిధ సమస్యలకు సంబంధించి మొత్తం నాలుగు అర్జీలు అందాయి. వచ్చిన ప్రతి అర్జీపై ప్రత్యేక దృష్టి సారించి, సంబంధిత శాఖల అధికారులకు పంపించి నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా చర్యలు చేపడతామని తహశీల్దార్ తెలిపారు. బాధితులకు సత్వర న్యాయం అందేలా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఓ గాయత్రి, ఆర్ఐ హైమావతి, ఐసీడీఎస్ సూపర్వైజర్ నాగభూషణమ్మ, ఏపీఎం కృష్ణవేణి, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కంటి సమస్యల గుర్తింపునకు వీపీఆర్ నేత్ర సేవలు

### - వేమిరెడ్డి దంపతుల సారథ్యంలో ఉచిత కంటి పరీక్షలు



**కొడవలూరు, జూన్ 8, ప్రభాతవార్త :** గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన నేత్ర వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో మండలం యల్లాయ పాళెం పంచాయతీ పరిధిలోని రామాపురంలో సోమవారం వీపీఆర్ నేత్ర సేవలు నిర్వహించారు. ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతుల సారథ్యంలో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా వైద్య నిపుణులు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి, బాధితులకు అవసరమైన సలహాలు అందించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేయడంతో పాటు శస్త్రచికిత్స అవసరమున్న వారిని గుర్తించి తదుపరి చికిత్సకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలు కంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స పొందేందుకు ఈ సేవలు ఉపయోగపడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కేతు వెంకటరమణారెడ్డి, భూలోకం విజయ్కుమార్, గరికపాటి రాజా, కె.శేఖర్రెడ్డి, సయ్యద్ అన్సర్, నాగభూషణం, రసూల్, వినయ్, పప్పు రవిబాబు, వీపీఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఓటరు జాబితా ప్రక్షాళనకు సర్ కార్యక్రమం

### - బీఎల్వోలకు అవగాహన కల్పించిన తహశీల్దార్



**విడవలూరు, జూన్ 8, ప్రభాతవార్త :** ఓటరు జాబితాలను కచ్చితంగా, పారదర్శకంగా రూపొందించేందుకు ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం వీడియో ప్రసారం ద్వారా అవగాహన, సమీక్ష సమావేశం నిర్వహించారు. స్థానిక తహశీల్దార్ కె. చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బూత్ లెవల్ అధికారులు (బీఎల్వోలు)కు కార్యక్రమ లక్ష్యాలు, విధివిధానాలపై అవగాహన కల్పించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను ధ్రువీకరించడం, కొత్తగా అర్హత పొందిన వారిని జాబితాలో చేర్చడం, మరణించిన లేదా ఇతర ప్రాంతాలకు మారిన వారి పేర్లను తొలగించడం, ఒకే వ్యక్తికి బహుళ నమోదులు ఉంటే వాటిని సవరించడం వంటి అంశాలపై సూచనలు చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా తప్పులులేని ఓటరు జాబితా రూపొందించడమే ఎస్ఐఆర్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ అబ్దుల్ సలాం, బి ఎల్ వోలు తదితరులు పాల్గొన్నారు.

## యాప్ ఆధారం.. అక్రమార్కులకు కళ్లెం : ఏఓ సుచేంద్రప్రసాద్



**కోట, జూన్ 8 ప్రభాతవార్త** ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో యూరియా, డిఏపి ఎరువులు పక్కదారి పట్టకుండా అధిక మొత్తంలో వినియోగించకుండా కళ్లెం వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ విధానాన్ని అమలు చేస్తుందని కోట మండల వ్యవసాయాధికారి ఎం.సుచేంద్రప్రసాద్ చెప్పారు. ఆ మేరకు సోమవారం కోటలోని వివిధ ఎరువుల దుకాణాలను పరిశీలించారు. ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ ఇన్‌ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ సిస్టం (ఎపిఏఐఎంఎస్ 2.0) యాప్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందని చెప్పారు. రైతు సేవా కేంద్రంలోని వ్యవసాయ సిబ్బంది, ప్రాథమిక సహకార సంఘాల (పిఏసిఎస్) ఎరువుల విక్రయ లైసెన్సు పొందిన డీలర్ల వద్ద ఎపిఏఐఎంఎస్ యాప్ ఉంటుందని చెప్పారు. రిటైల్ వ్యాపారులను ఆర్ఎస్‌కెలతో అనుసంధానం చేయడం జరిగిందన్నారు. యాప్‌లో గత ఖరీఫ్ సీజన్‌లో ఈ-పంట నమోదు వివరాల ఆధారంగా ఎరువుల కేటాయింపులు జరుగుతాయన్నారు. రైతులు ఆధార్ నంబర్ చెబితే చాలు.. యాప్‌లో నమోదు చేసి టోకెన్ జారీ చేస్తారని తెలిపారు. రైతు మొబైల్ నంబర్‌కు సంక్షిప్త సమాచారం వచ్చిన తర్వాత ఎరువులు తీసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. యాప్‌లో నమోదు చేసుకుంటే ఎంఆర్‌పి ధరలకే ఎరువులు పొందే అవకాశం కలుగుతుందన్నారు. ఎంత మోతాదులో ఎరువులు కావాలో రైతులకు అంతవరకే పంపిణీ చేస్తారని తెలిపారు. ఎలాంటి అక్రమాలకు అవకాశం ఉండదన్నారు. ప్రతి రైతు యాప్‌లో తమ పేరు, వివరాలు నమోదు చేసుకోవాలని ఏఓ సుచేంద్రప్రసాద్ కోరారు.

## పెన్షన్లు పంపిణి చేయలేకున్నాం మమ్మల్ని మినహాయించండి



**బుచ్చి జూన్ 8 ప్రభాతవార్త** ప్రతి నెల వృద్దులు వికలాంగులు ,ఒంటిరి మహిళలకు ఇచ్చేపెన్షన్లు పంపిణి నుండి ఆశావర్కర్లను మినహాయించాలని సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో ఆశావర్కర్లును మినహా యించాలని సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో ఆశావర్కర్లు చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళికి ,మున్సిపల్ కమీషనర్ చినబాబుకి వినతిపత్రం అంధజేశారు.సిఐటియు మండల కార్యదర్శి చల్లకొలుసు మల్లికార్జున మా ట్లాడుతు పెన్షన్లు పంపిణి సమయంలో సర్వర్లు పనిచేయకపోవడం అదే సమయంలో గర్భిణీలకు అత్యవసర వైద్యం అవసరం తదితర సమస్యలతో పించన్ లబ్దిదారుల నుండి తీవ్ర ఇబ్బందులు ఎదురుకోవాల్సి వస్తుందని ఆశావర్కర్లు తెలిపారు. ఇదే కాక తమకి ఆశాయాప్‌లు,లబ్దిదారుల యాప్‌లు, ఏఎన్ఎం యాప్‌లు వలన తీవ్రమైన పని ఒత్తిడి ఉంటుందని,దానికి తోడు ఈ పించన్లు పంపిణి వల్ల మానసికంగా ఇబ్బందులు పడుతున్నామన్నారు. పించన్లు పంపిణి సమయంలో నగదు డబ్బులు మిస్ అవుతున్నాయని ఈ ఆర్దిక భారం భరించలేకుండా ఉన్నామని అందువలన తమని ఈ పించన్లు పంపిణి నుండి మినహాయించాలని వారు కోరారు. ఆశావర్కర్లు ఎస్వి రమణమ్మ, ఎం ప్రశాంతి, ఈసుభాషిణి, సిహెచ్ ధనమ్మ, పి లక్ష్మి.,టి తిరుపతమ్మ, ఎన్‌వాణి, ఈధనలక్ష్మి. కె లక్ష్మి, వై శ్రీదేవి, సిహెచ్ సుభాషిణి, టి సునీత, డికెజియా, ఎస్‌సీతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## రేపు గ్రామాభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ



**విడవలూరు, జూన్ 8 ప్రభాతవార్త:** స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ)అం శంపై బుధవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నాగేశ్ కుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అభి.వృద్ధి అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు. గ్రామాల సమగ్ర అభివృద్ధికి స్థానిక అవసరాల ఆధారంగా ప్రణాళికల రూ పకల్పన, అమలు విధానాలపై అవగాహన కల్పించడమే ఈ శిక్షణ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఆమె పేర్కొన్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్ణీత సమయానికి హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో విజ్ఞప్తి చేశారు.



### డాక్యుమెంట్లు పోయినవి

గుమ్మడి ధనలక్ష్మి రేపల్లె గ్రామం బాపట్ల జిల్లా నందు నివసించుచున్నాను. మా నాన్నగారు మేక వెంకటరాయుడు గారి పొలము డాక్యుమెంట్లు పోయినవి. రిజిస్ట్రేషన్ నెంబర్ 354/1984 పొదలకూరు నుండి పెద్ద గోపవరంకు వచ్చే దారిలో పోగొట్టుకున్నాము. ఎవరికైనా దొరికిన యెడల తెచ్చిఇవ్వగలరు.

సంప్ర: సెల్: 9490342411

## బీహార్ రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి “ఆనం”



**ఆత్మకూరు,జూన్8,ప్రభాతవార్త:** బీహార్ రాష్ట్రంలోని ఔరంగాబాద్ సమీపంలోజరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో సంగం మండలానికి చెందిన ఇద్దరు, నెల్లూరు నగరానికిచెందిన ఒకరు మొత్తం ముగ్గురు భక్తులు మృతి చెందడం పట్ల రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి ,విచారం వ్యక్తం చేశారు. ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని సంగం ప్రాంతం నుంచి 43మంది యాత్రికులతో గయ, వారణాసి పుణ్యక్షేత్రాల దర్శనానికి బయలుదేరిన ప్రవేటు బస్సు ప్రమాదానికి గురై ముగ్గురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరమని మంత్రి పేర్కొన్నారు.మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ దుర్ఘటన బాధిత కుటుంబాలకు తీరని లోటన్నారు.ప్రమాదంలో గాయపడిన యాత్రికులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మంత్రి వారికి అవసరమైన వైద్య సేవలు అందేలా అధికార యంత్రాంగం ద్వారా నిరంతరం పర్యవేక్షిసు_న్నామన్నారు. ఈక్లిష్ట సమయంలో బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని, అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.స్వస్థలాలకు దూరంగా జరిగిన ఈ విషాద ఘటనతో కుటుంబ సభ్యులు తీవ్ర వేదనలో ఉన్నారని, వారి బాధను ప్రభుత్వం పంచుకుంటుందని మంత్రి పేర్కొన్నారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించిన మంత్రి వారి కుటుంబ సభ్యులకు ఈ తీవ్ర విషాదానిన తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాధించాలని భగవంతుడిని ప్రార్థించారు. ప్రమాదానికి గురైన యాత్రికుల పరిస్థితిపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించినట్లు తెలిపారు. బాధితులకు సహాయ సహకారాలు అందించడంలో ఎలాంటి లోటు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికార యంత్రాంగానికి సూచించినట్లు మంత్రి పేర్కొన్నారు.

## విఆర్ఓ హుస్సేన్ మృతికి కారకుడైన తహసిల్దార్‌ను శిక్షించాలి

### - విఆర్ఓల నిరసన



**అనుమసముద్రంపేట ,జూన్8,ప్రభాతవార్త:** నంధ్యాల జిల్లా వెంకయ్యపల్లె విఆర్ఓగా విధులు నిర్వహిస్తూ ఆత్మహత్యకు పాల్పడిన మహమ్మద్ హుస్సేన్ మృతికి కారకుడైన తహసిల్దార్‌ను వెంటనే విధుల నుంచి తొలగించి కేసు నమోదు చేసి విచారణ జరిపి కఠినచర్యలు తీసుకోవాలని విఆర్ఓల సంఘం డిమాండ్ చేసింది. సోమవారం ఏఎస్‌పేట మండల తహసిల్దార్ కార్యాలయం ఎదుట విఆర్ఓల సంఘం డిమాండ్ చేసింది. సోమవారం ఏఎస్‌పేట మండల తహసిల్దార్ కార్యాలయం ఎదుట విఆర్ఓల సంఘం ఆత్మకూరులో విఆర్ఓలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా విఆర్ఓల ఐక్యత వర్థిల్లాలి , మహమ్మద్ హుస్సేన్ అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ కింది స్థాయి సిబ్బంది యోగక్షేమాలను పట్టించుకొనకుండా కొంతమంది ఉన్నతాధికారులఉ ఒత్తిళ్ళకు గురిచేస్తున్నారని ఆరోపించారు. తహసిల్దార్ ఒత్తిడిని తట్టుకోలేక మహమ్మద్ హుస్సేన్ తన సూసైడ్ నోట్‌లో పూర్తి వివరాలు రాసి ఆత్మహత్య చేసుకున్నాడని పేర్కొన్నారు. అందువలన హుస్సేన్ మృతికి బాధ్యులైన వారిపై వెంటనే చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు. అలాగే హుస్సేన్ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి వారి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం తమ డిమాండ్లను వెంటనే పరిశీలించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో విఆర్ఓలు సంఘం డివిజన్ అధ్యక్షుడు ఎస్.కృష్ణయ్య, సహాయ కార్యదర్శి కృష్ణప్రసాద్, విఆర్ఓలు రమణయ్య, లావణ్య, హరికృష్ణ, రాఘవులు, అమాసయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఏఎస్‌పేట తహసిల్దార్‌గా డిఎస్ స్వరూప్ బాధ్యతల స్వీకరణ



**అనుమసముద్రంపేట ,జూన్8,ప్రభాతవార్త:** ఏఎస్‌పేట మండల నూతన తహసిల్దార్‌గా దార్ల శాంతి స్వరూప్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు.ఆత్మకూరులో డిప్యూటీ తహసిల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న శాంతి స్వరూప్‌ను డిప్యుటేషన్‌పై ఏఎస్‌పేట తహసిల్దార్‌గా నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆమేరకు ఆయన సోమవారం బాధ్యతలు చేపట్టారు. నూతన తహసిల్దార్‌ను డిటి వెంకటేశ్వర్లు, రీ-సర్వే డిటి వెంకటేశ్వర్లు, ఆర్ఐ పెంచలబాబు తదితర రెవెన్యూ సిబ్బంది సాదరంగా ఆహ్వానించి బొకేలు అందజేసి శాలువాలతో సన్మానించి అభినందించారు. అనంతరం మండలంలోని రెవెన్యూ శాఖ పరిస్థితులు , పెండింగ్ అంశాలపై సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. మండలంలో ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలు అందించేందుకు సమన్వయంతో పని చేయాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈసందర్భంగా తహసిల్దార్ డి.ఎస్.స్వరూప్ మాట్లాడుతూ మండల ప్రజలకు రెవెన్యూ పరంగా ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ కృషి చేస్తామన్నారు. ప్రజలకు పారదర్శకమైన , వేగవంతమైన సేవలు అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

## సదరంకు వచ్చే వారు నిర్దేశించిన పత్రాలతో రావాలి



**కోవూరు, జూన్8 ప్రభాతవార్త :** కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి ప్రతి సోమవారం సదరం పరీక్షకు వచ్చే రోగులు వారి దగ్గర ఉన్న దృవీకరణ పత్రాలతో తప్పక హాజరు కావాలని ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ అమృత తెలిపారు. కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం 21 మందికి సదరం పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సదరంకు వచ్చే వారు వారి దగ్గర ఉన్న పత్రాలతో పాటు హాస్పిటల్‌కు సంబంధించిన రిపోర్టులు ఏమైనా ఉంటే వాటిని కూడా తప్పక తీసుకురావాలన్నారు.

## ఎట్టకేలకు తొలగిస్తున్న మురుగునీరు

### వార్తకు స్పందన



**బిట్రగుంట, జూన్ 8, ప్రభాతవార్త :** బోగోలు మేజర్ పంచాయతీలోనియాదవ్ పాలెంలో రోడ్డుపై పొంగిపొర్లుతున్న మురుగునీరు అని సోమవారంవార్త దినపత్రికలో ప్రచురితమైన వార్తకు పంచాయతీ పారిశుధ్య సిబ్బంది స్పందించారు. పంచాయతీ అధికారుల చొరవతో మురుగునీరు తొలగింపు కార్యక్రమం చేపట్టారు.



# స్మశాన భూమికి 20 ఏళ్ల తర్వాత మోక్షం

## - ప్రత్యేక దృష్టి పెట్టిన తహసీల్దార్



**కోవూరు, జూన్8 ప్రభాతవార్త** కోవూరు మండలం పాటూరు పంచాయతీ పరిధిలోని సర్వేనెంబర్ 617, 618లో నాలుగు ఎకరాల 24 సెంట్ల భూమి గతం లోనే స్మశానానికి కేటాయించారు. అయితే గత 20 సంవత్స రాలుగా ఈ స్మశాన భూమిని ఒక రైతు ఆక్ర మించుకుని దర్జాగా వ్యవసాయం చేస్తున్నారు. చెంచమ్మ తోపు, చక్కిరాలదిబ్బ ప్రాంతాల నుంచి ఎవరైనా మృతదేహాన్ని తీసుకువస్తే ఈ స్మశాన భూమిలో పూడ్చేందుకు సంబంధిత రైతు అంగీకరించేవాడు కాదు. దీంతో ఆ ప్రాంతానికి చెందిన గిరిజనులు గత సంవత్స రాలుగా రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా దానిపై ఎవరూ ఆశించిన మేర దృష్టి పెట్టిన దాఖలాలు లేవు. ఈ నేపథ్యంలో కోవూరు తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య దీనిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టి భూమికి సంబంధించిన మొత్తం పత్రాలను వెలికి తీశారు. ఈ సర్వే నెంబర్లలో 4 ఎకరాల 24 సెంట్ల భూమి స్మశానానికే కేటాయించినట్లు వివరాలు లభ్యమయ్యాయి. దీంతో ఆ రైతుకు నోటీసులు ఇచ్చి ఈ స్థలం మొత్తానికి సర్వే చేయించి గ్రామ రెవెన్యూ అధికారి ఎస్కే ఖాదర్ మస్తాన్ దీనిపై చొరవ తీసుకుని నిశితంగా సర్వే చేపట్టి మొత్తం భూమికి సర్వే రాళ్ల ఏర్పాటు చేసి ఈ స్థలం స్మశానానికి కేటాయించినది అని ఒక ఫ్లెక్సీ కూడా ఏర్పాటు చేశారు.

**– తహసీల్దార్ చొరవతోనే..** గత 20 సంవత్స రాలుగా ఆక్రమణలో ఉన్న స్మశాన భూమిని తిరిగి వెలికి తీసేందుకు కోవూరు తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య ప్రత్యేకంగా చొరవ తీసుకున్నారని, ఈ నేపథ్యంలో చెంచమ్మతోపు, చక్కిరాలదిబ్బ ప్రాంతాలకు చెందిన గిరిజనులు సోమవారం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని శాలువా, పూలమొక్కతో అభినందించారు. అదేవిధంగా ఇందుకు సహకరించిన వీఆర్వో ఖాదర్ మస్తార్, సర్వేయర్ చిరంజీవిలను కూడా గ్రామస్తులు అభినందించారు. 20 ఏళ్లతమ పోరాటం నేటికి తహసీల్దార్ కారణంగానే నెరవేరిందని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.






# రెండేళ్ల పాలనలో సూపర్‌సిక్స్.. సూపర్‌హిట్ :ఎంపిపి శశి



**కోట, జూన్ 8 ప్రభాతవార్త** కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో సీఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను 90 శాతం నెరవేర్చారని కోట మండల పరిషత్ అధ్యక్షురాలు ఎంబేటి శశి అన్నారు. సోమవారం ఆమె తన కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడారు. సూపర్‌సిక్స్ పథకాలు సూపర్ హిట్టయ్యాయని చెప్పారు. ఇందులో భాగంగా వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు ఎన్టీఆర్ సామాజిక భరోసా కింద పెన్షన్లు ఇచ్చినట్లు తెలిపారు. తల్లికి వందనం పథకం కింద ఎంతమంది చదువుకునే పిల్లలు ఉంటే అంతమందికి ప్రభుత్వం నగదును తల్లుల ఖాతాల్లో జమ చేసిందని పేర్కొన్నారు. మత్స్యకారులకు జీవనోపాధి కింద ఏడాదికి రూ.20 వేలు చొప్పున ప్రభుత్వం ఇచ్చిందన్నారు. దీపం పథకం కింద ఏడాదికి మూడు సిలిండర్లను ఉచితంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిందన్నారు. స్త్రీ శక్తి పథకాన్ని ప్రవేశపెట్టి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించినట్లు తెలిపారు. మెగా డీఎస్సీ నిర్వహించి రాష్ట్రంలో 16వేల ఉపాధ్యాయ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసిందన్నారు. అయితే ఇది ఓర్వలేక వైసీపీ డీఎస్సీపై తప్పుడు ప్రచారాలకు దిగుతుందన్నారు. ఎమ్మెల్యే పాశింసునీల్‌కుమార్ సహకారంతో కోట మండల తెలుగుదేశం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో మండలాన్ని ప్రగతిపథంలో నడిపిస్తామని ఎంపిపి శశి స్పష్టం చేశారు.

# అచ్చం అర్బన్‌లా..రూర్బన్ పాలన



**కోట, జూన్ 8 ప్రభాతవార్త** గ్రామ పంచాయతీల్లో పట్టణ తరహా పాలన అమలుకు ప్రభుత్వం రూర్బన్ పంచాయతీల విధానం అమల్లోకి తీసుకొచ్చింది. ఇందులో భాగంగా జిల్లాలో 13 పంచాయతీలను ఎంపిక చేసింది. అందులో కోట పంచాయతీ కూడా రూర్బన్ పంచాయతీ కింద ఎంపికైంది.

**ఎంపిక అర్హత** మైదాన ప్రాంతాల్లో 10 వేలమందికి పైగా జనాభా లేదా కోటికి పైగా ఆదాయం, షెడ్యూల్డ్ ఏరియా ఐదు వేలకు పైగా జనాభా ఉన్న పంచాయతీలను ఈ పథకం కింద ఎంపిక చేశారు. వీటికి గెజిటెడ్ హోదా కలిగిన పంచాయతీ అభివృద్ధి అధికారి (ఇడిఓ)లను నియమించనున్నారు. నిధుల కేటాయింపుల్లో సైతం ప్రాధాన్యత కల్పించనున్నారు. ప్రస్తుతం ఉన్న పంచాయతీ కార్యదర్శుల్లో అర్హులకు ఇడిఓలుగా పదోన్నతులు కల్పించి రూర్బన్ పాలకులుగా నియమించనున్నారు.

**విభాగాలుగా..** రూర్బన్ పంచాయతీల్లో పురపాలక సంఘాల మాదిరిగా ఇంజినీరింగ్, ప్రణాళిక, ప్రజారోగ్యం, రెవెన్యూ విభాగాలను ఏర్పాటు చేస్తారు. ఈ పరిపాలన మెరుగైన పౌరసేవలు, మౌలిక సదుపాయాల కల్పన, పంచాయతీల ఆదాయాన్ని పెంపొందించడంలో కీలకంగా వ్యవహరిస్తాయి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న పంచాయతీ సిబ్బందిని వారి ఆసక్తిని బట్టి ఆయా విభాగాలకు కేటాయించనున్నారు.

**- ఇంజినీరింగ్ విభాగం :** రహదారులు, కాలువల నిర్మాణం, ప్రభుత్వ భవన నిర్మాణ పనులు, ప్రజలకు తాగునీటి సరఫరా, వీధిదీపాల నిర్వహణ ఈ విభాగం పరిధిలో జరుగుతాయి.

**-ప్రణాళిక :** ప్రణాళికాబద్ధంగా పంచాయతీ విస్తరణ, స్థలాల సంరక్షణ, భవన నిర్మాణ అనుమతులు, మాస్టర్ ప్లాన్ తయారీ బాధ్యతలు చూస్తుంది.

**- ప్రజారోగ్యం :** ఇంటింట చెత్త సేకరణ, వీధుల శుభ్రత, దోమల నియంత్రణ, ఘన వ్యర్థాల నిర్వహణ పనులను పర్యవేక్షిస్తుంది.

**- రెవెన్యూ :** ఇంటి పన్నులు విధింపు, వసూళ్లు, పంచాయతీ స్థలాల్లో వాణిజ్య సముదాయాల నుంచి అద్దె వసూలు వంటి ఆదాయాన్ని సమకూర్చేందుకు దోహదపడుతుంది. త్వరలో ఆయా ప్రాంతాల్లో అర్బన్ తరహాలో ప్రజలకు పాలన అందించనున్నారు.

# రామతీర్థం తీరంలో యోగా సందడి

## :మెగా యోగా డేకు సన్నాహాలు వెల్లడించిన బెజవాడ వంశీకృష్ణారెడ్డి



**విడవలూరు, జూన్ 8 ప్రభాతవార్త:** మండలంలోని రామతీర్థం బీచ్ వద్ద అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం యోగా డెమో కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ సూచనలు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు స్థానిక ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సహకారంతో కార్యక్రమం నిర్వహించినట్లు టీడీపీ సీనియర్ నాయకుడు బెజవాడ వంశీకృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో భాగం కావాలని అన్నారు. యోగా సాధనతో శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ప్రశాంతత కూడా లభిస్తుందని పేర్కొన్నారు. ప్రజల్లో యోగాపై మరింత అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. ఈ నెల 16న నిర్వహించనున్న మెగా యోగా డే కార్యక్రమాన్ని కోవూరు నియోజకవర్గంలో భారీ స్థాయిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమం విజయవంతానికి సహకరించిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, జాయింట్ కలెక్టర్, పోలీసు శాఖ అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ఎస్సై నరేష్, మండల ఇన్‌చార్జి అడపాల శ్రీధర్‌రెడ్డి, ఆవుల వాసు, చిన్నబాబు, నాటారు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

# జిల్లాలోని అర్చక సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి



**నెల్లూరు, జూన్8, ప్రభాతవార్త – విద్య** జిల్లాలోని అర్చక సిబ్బంది సమస్యల పరిష్కారానికి తమవంతుగా సత్వరం కృషి చేస్తామని జిల్లా దేవాదాయ శాఖ అధికారి కోవూరు జనార్ధన్ రెడ్డి తెలిపారు. సోమవారంజిల్లాలో పనిచేయుచున్న అర్చక సిబ్బందితో గ్రీవెన్స్‌ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆయన పాల్గొని విజ్ఞప్తులని స్వీకరించారు . అనంతరం దేవదాయశాఖాధికారి మాట్లాడుతూ ఈ గ్రీవెన్స్‌లో సుమారు 105 మంది అర్చకులు పాల్గొనడం జరిగింద న్నారు. 32 మంది అర్చకులు వారి వారి సమస్యలను తమ దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. వాటిలో 14 మంది అప్లికేషన్ పరిశీలించి జీతము,పడితరము పెంచి తక్షణం పరిష్క రించమని మరో 10 మందికి దేవాదాయ శాఖ వారి అర్చక మరియు ఇతర ఉద్యోగుల సంక్షేమ నిధి నుండి జీతాల కోసం రాష్ట్ర కమి షనర్ కి సిఫారసు చేశామన్నారు . అలాగే మిగిలిన 8 మంది అర్చకులకు అరియర్ జీతమును వేంటనే విడుదల చేసేలా ఈఓలని ఆదేశించామన్నారు. కూటమి ప్రభుత్వంలో ఇప్పటివరకు 250 మంది అర్చకులకు దూప దీప నైవేద్యం పథకం క్రింద లబ్ది పొందడం జరుగు తుం దన్నారు . ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ, పరిశీలకులు, కార్యనిర్వహణాధికారులు మరియు నెల్లూరు జిల్లా అర్చక సమాఖ్య ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు .

# మంత్రి కొల్లు రవీంద్రను కలిసిన గంజాం రాఘవేంద్ర



**నెల్లూరు, జూన్ 8, ప్రభాతవార్త – వైద్యం** రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రని విజయవాడ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి, నియోజకవర్గ పరిశీలకులు గంజాం రాఘవేంద్ర కలిసారు. ఈ సందర్భంగా బీసీ కులాల సమస్యలు, ప్రత్యేకంగా రజక సామాజికవర్గానికి సంబంధించిన సామాజిక, ఆర్థిక రాజకీయ అంశాలపై చర్చించారు.

# సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అర్జీలను స్వీకరించిన ఎమ్మెల్యే




**కావలి, జూన్ 8 ప్రభాతవార్త :** ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కావలి టిడిపి పార్టీ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలనుంచి ప్రజలు తమ సమస్యలను తెలియజేస్తూ వినతిపత్రాలను ఎమ్మెల్యేకు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ప్రతి అర్జీని పరిశీలించి బాధితుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. కొన్ని సమస్యపై సంబంధిత అధికారులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడి వాటిని తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా, పెండింగ్‌లో ఉన్న సమస్యలు త్వరితగతిన పరిష్కారం అయ్యేలా ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను కోరారు. ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు.

# నూతన మున్సిఫల్ భవనాన్ని పరిశీలించిన చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా



**బుచ్చి జూన్ 8 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డి పాళెం మున్సిపాల్టీలోని బెజవాడ గోపాల్‌రెడ్డి పార్కు వద్ద నూతనంగా నిర్మిస్తున్న మున్సిఫాల్టీ భవన నిర్మాణ కార్యాలయం పనులను మున్సిపల్ చైర్ పర్సన్ మోర్ల సుప్రజామురళీ, వైస్ చైర్మన్ యరటపల్లి శివకుమార్‌రెడ్డి, కమీషనర్ చిన్నబాబుతో కలిసిపరిశీలించారు. భవన నిర్మాణం పనులు త్వరితగతిన పూర్తి చేసిన కాంట్రాక్టర్ శేషయ్యను చైర్‌పర్సన్ అభినందించారు. ఈనెలాఖరులోగా మున్సిఫల్ భవన కార్యాలయాన్ని ప్రారంభిస్తామని ఆమె తెలియజేశారు. ఈకార్యక్రమంలో కౌన్సిలర్ బెళ్ళం మల్లారెడ్డి, ఏఈ వెంకటేష్,కాంట్రాక్టర్ వెంకట శేషయ్య తదితరులున్నారు.

# బీజేపీతోనే దేశాభివృద్ధి

## మాజీ ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ రావు



**గూడూరు, జూన్ 8, ప్రభాతవార్త** గూడూరు పట్టణంలోని రిటైర్డ్ ఎంప్లాయిస్ భవనంలో బిజెపి నియోజకవర్గ క్రియాశీలక కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే నాయకులు వెలగపల్లి వరప్రసాద్ విచ్చేసి మాట్లాడుతూ వైసిపి పార్టీలో నిబద్ధతగా పనిచేశామని అనేక మంది దళితులకు ఎన్నికల్లో పోటీ చేసేందుకు మరల అవకాశం ఇవ్వకుండా అవమాన పరిచారని గుర్తు చేశారు. గూడూరు ప్రజల ఆకాంక్ష నెల్లూరు జిల్లాలో కలవడం అని కూటమి ప్రభుత్వం జిల్లా మార్పు చేసిందని నేటి నుండి అధికారికంగా మారిందని తెలిపారు బిజెపి పార్టీ అవినీతి లేని పాలన దేశానికి అందిస్తుందని నియోజకవర్గ స్థాయిలో బిజెపి పార్టీని కార్యకర్తలు నాయకులు బలోపేతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, బాలకృష్ణ నాయుడు, పనబాక కోటేశ్వరరావు, దయాకర్, ప్రకాష్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# నరుకూరులో వైఎస్సార్‌సీపీ మండల విస్తృత స్థాయి సమావేశం



**తోటపల్లి గూడూరు, జూన్ 8, ప్రభాతవార్త** సర్వేపల్లి నియోజకవర్గంలోని నరుకూరు గ్రామం రిషి గ్రాండ్ కల్యాణ మండపంలో మాజీ ఏపీ డెయిరీ చైర్మన్ చిల్లకూరు సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల విస్తృత స్థాయి స మావేశం ఘనంగా నిర్వహిం చా రు. "ప్రభుత్వ వైఫల్యాలు -మో సాలపై ముఖాముఖి, "చంద్ర బా బు వెన్నుపోటు రెండేళ్ల కార్యక్ర మాల నేపథ్యంలో పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రభుత్వ విధానాలపై నిరసన వ్యక్తం చేశాయి. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సా ర్‌సీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలపై వైఎస్సా ర్ కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. మహిళలు, రైతులు, యువత, సామాన్య ప్రజల సంక్షేమానికి సంబంధించిన అనేక హామీలు నెరవేరలేదని విమర్శించారు. రాష్ట్ర మహిళా విభాగ వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజితమ్మ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు. మహిళల భద్రత, రైతుల సంక్షేమం, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలు కేవలం ప్రచారానికే పరిమితమయ్యాయని విమర్శించారు. అదే విధంగా చంద్రబాబు పాలనలో మహిళలపై దాడులు, రైతులకు గిట్టుబాటు ధరల సమస్యలు, నిరుద్యోగ భృతి అమలు కాకపోవడం, పెన్షన్ల పంపిణీలో ఇబ్బందులు వంటి అంశాలను టీవీ స్క్రీన్‌పై ఫోటో ప్రదర్శన ద్వారా కార్యకర్తలకు, ప్రజలకు సవివరంగా వివరించారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువలు దెబ్బతిన్నాయని, ప్రజావ్యతిరేక విధానాలపై వైఎస్సార్‌సీపీ పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలని పూజితమ్మ పిలుపునిచ్చారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన ప్రతి కార్యకర్తకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఉప్పల శంకరయ్య గౌడ్, తలమంచి సురేంద్రబాబు, గూడూరు విష్ణు మోహన్ రెడ్డి, మన్యం సుబ్రహ్మణ్యం గౌడ్, ఇసనాక రమేష్ రెడ్డి, కావల్ రెడ్డి రంగారెడ్డి, టంగుటూరు పద్మనాభ రెడ్డి, శేషు, దుర్గా, వేముల శ్రీనివాసులు, అవినాష్ రెడ్డి, గోడా సురేష్, గోనెల వినోద్ తదితర నాయకులు పాల్గొన్నారు



# అక్రమ గ్రావెల్ తరలింపుపై అధికారులు మౌనం వహించడం దారుణం.. కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్





**కావలి, జూన్ 8 ప్రభాతవార్త :** కావలి నియోజకవర్గంలో విచ్చలవిడిగా అక్రమ గ్రావెల్ దందా జరుగుతోందని అధికారులుచూసి చూడనట్లుగా మౌనం వహించడం దారుణమని వైసిపి కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డిప్రతాప్‌కుమార్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అక్రమ గ్రావెల్ దందాపై మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో వైసిపి నాయకులతో కలసి సోమవారం ఆర్డీఓ ఎలిషాకు వినతిపత్రాన్ని అందజేయడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారులకు అక్రమ గ్రావెల్ రవాణ పైపలుమారు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం ఎంతవరకు సమంజసంఅన్నారు. ఈ అక్రమ రావాణలో అధికారుల పాత్ర ఉన్నట్లు అనుమానం ఉందని తెలిపారు. అక్రమ మైనింగ్‌గ్రావెల్, మట్టి మాఫియా యదేచ్ఛగా తవ్వకాలను పట్టపగలే చేపడుతుంటే ఫోన్‌చేసి తానే ఫిర్యాదు చేసినా మూడురో జు లైనా ఇంతవరకు పట్టించుకోని అధికారులపై అసహనం వ్యక్తంచేశారు. అధికారులు దళారులకే అమ్ముడు పోయి వ్యవస్థలను పాడు చేయడం సబబుగా లేదన్నారు. దీనిపై వెంటనే అధికారులు స్పందించకపోతే త్వరలో వైసిపి పార్టీ ఆధ్వర్యంలో అడ్డుకుంటామని హెచ్చరించారు. వైసిపి పట్టణ అధ్యక్షులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కేతిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కనమర్లపూడి వెంకటనారాయణ, జిల్లా కార్యదర్శి గంధం ప్రసన్నాంజనేయులు తదితర వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎన్నికల కమిషన్ ఆదేశాలను తప్పక పాటించాలి



**కోవూరు, జూన్8 ప్రభాతవార్త :** కోవూరులోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌కు సంబంధించిన బీఎల్‌వోలకు, సూపర్‌వైజర్లకు శిక్షణా తరగతులు నిర్వహించారు. తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య మా ట్లాడుతూ 15వ తేది నుంచి ప్రతి బీఎల్‌వో వారికి కేటాయించిన బూత్ పరిధిలో ఇంటింటికీ వెళ్లి ఫారాలు అందజేస్తారన్నారు. వారు పూర్తిగా ఫారం నింపి ఇచ్చిన తర్వాత దానిని ఒకటికి రెండు సార్లు పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 15 నుంచి 30 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ప్రతి బీఎల్‌వో వారికి కేటాయించిన విధులు, బాధ్యతలను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఎన్నికల కమిషన్ ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం ఎవరికి కేటాయించిన బాధ్యతలు వారు సక్రమంగా నిర్వహించాలన్నారు. వీడియో రూపంలో బీఎల్‌వోలకు, సూపర్‌వైజర్లుకు అవగాహన కల్పించారు.

# అక్రమ తెల్లరాయి రవాణా

## - గ్రామస్తుల ఫిర్యాదుతో లారీ సీజ్ చేసిన పోలీసులు



**వింజమూరు, జూన్ 8, ప్రభాతవార్త** వింజమూరు మండల పరిధిలోని జనార్ధనపురంలో అక్రమంగా తీసిన తెల్లరాయి తరలిస్తున్న లారీని స్థానిక గ్రామస్తులు సోమవారం అడ్డుకున్నారు. అనుమతులు లేకుండా తెల్లరాయిని తరలిస్తున్నారని ఆరోపిస్తూ గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న వింజమూరు ఎస్ఐ ఉమామహేశ్వరరావు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని లోడుతో ఉన్న లారీని డ్రైవర్ను అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనం చేసుకున్న లారీని వింజమూరులోని అగ్నిమాపక కేంద్రం ఆవరణలో భద్రపరిచారు. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు. గతంలో కూడా జనార్ధనపురం నుంచి అనధికారికంగా తెల్లరాయిని తరలించేందుకు ప్రయత్నించారని గ్రామస్తులు తెలిపారు. అప్పట్లో పోలీసు అధి కారులు స్పందించి, గనుల శాఖ అనుమతి లేకుండా రాయిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చ రించడంతో అతడు తరలింపు ప్రయత్నాన్ని విరమించుకున్నాడు. అయితే ఇటీవల గ్రామస్తుల కళ్లుగప్పి ఒక లోడు తెల్లరాయిని అక్రమంగా తరలించాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. మిగిలిన మరోలోడు రాయిని సోమవారం తరలించేందుకు యత్నించగా అప్రమ త్తమైన గ్రామస్తులు అడ్డుకుని పోలీసులకు సమాచారం అం దించారు. ఎస్ఐ మాట్లాడుతూ అక్రమ తెలల్రాయి తవ్వకాలుపై గనుల శాఖ అధికారులకు సమాచారం అందించమన్నారు. సహజ వనరులను ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై పేర్కొన్నారు.

# సర్వేపల్లిలో నిరంతర ప్రక్రియగా సీఎంఆర్‌ఎఫ్ సాయం



**నెల్లూరు, జూన్ 8, ప్రభాతవార్త – వైద్యం** నెల్లూరు వేదాయపాళెంలోని కార్యాలయంలో సోమవారం 36 మందికి రూ.33.97 లక్షల విలువైన చెక్కులు సర్వేపల్లి శాసన సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అందించారు. రెండేళ్లలో ఇప్పటి వరకు 829 మందికి రూ.7.75 కోట్లు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సాయం మంజూ రైనట్లు ఎమ్మెల్యే సోమిరెడ్డి వెల్లడించారు. పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి వరంగా మారింది. ఎన్ని దరఖాస్తులు పంపినా ఉదారంగా సాయం మంజూరు చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వ పాలనలో సీఎంఆర్ఎఫ్ ను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయ్యాక ప్రతి పేద కుటుంబానికి అండగా నిలుస్తున్నారని కొనియాడారు.

# డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమానికి 14 ఫిర్యాదులు



**నెల్లూరు, జూన్ 8, ప్రభాతవార్త – వైద్యం** నెల్లూరులోని విద్యుత్ భవన్ నందు నిర్వ హించిన "డయల్ యువర్ ఎస్ఈ కార్యక్ర మానికి జిల్లాలోని వివిధ డివిజన్ల నుండి మొత్తం 14 ఫిర్యాదులు అందినట్లు జిల్లా విద్యుత్‌శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ కె. రాఘవేం ద్రం తెలిపారు. ఈఫిర్యాదులు ముఖ్యంగా విద్యుత్ అంతరాయం లో వోల్టేజ్ సమస్యలు, అదనపు ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయాలని, ఫోన్ నెంబర్ మరియొక సర్వీస్‌కు లింక్ అయిందని, ఐరన్ పోల్ మార్చాలని తదితర అంశాలకు సంబంధించినవిగా ఉన్నాయని తెలిపారు. వినియోగదారుల సమస్యలను వేగంగా పరిష్కరించాలనే లక్ష్యంతో ప్రతి సోమవారం "డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమం నిర్వహించబడుతున్నదని, వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నోడల్ ఆఫీసర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టెక్నికల్ శేషాద్రి బాల చంద్ర, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీధర్, అసిస్టెంట్ ఇంజనీర్లు నరసింహ రావు, తిరుపతయ్య, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.